
వార్త
ఆదివారం
12 ఫిబ్రవరి, 2023



# వెండితెర కళాతపస్వి

# మహేశ్ సినిమాలో ఐశ్వర్యరాయ్?



**మహేశ్‌బాబు** తన కెరియర్‌లో 28వ సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలో చేస్తున్నాడు. హారిక అండ్ హాసిని బ్యానర్‌లో ఈ సినిమా నిర్మితమవుతోంది. పొలిటికల్ టచ్‌తో ఈ కథ నడుస్తుందనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో కథానాయికగా పూజాహెగ్డే కనిపించనుంది. మరో ముఖ్యమైన పాత్రలో శ్రీలీల అలరించనుంది.

ఈ సినిమాలో ఒక కీలకమైన పాత్ర కోసం ఐశ్వర్యరాయ్‌ను సంప్రదించి నట్టుగా తెలుస్తోంది. త్రివిక్రమ్ తన సినిమాల్లోని కీలకమైన పాత్రలని సీనియర్ హీరోయిన్స్‌తో చేయిస్తుంటారు. అలా ఆయన నదియా, ఖుష్బూ, టబు లాంటివారిని తన సినిమాల్లో తీసుకున్నారు. ఇప్పుడు ఐశ్వర్యరాయ్ పేరు వినిపిస్తోంది. ఈ సినిమాలో ఐశ్వర్యరాయ్ పాత్ర నెగెటివ్ షేడ్స్‌ను కలిగి ఉంటుందని చెబుతున్నారు. ఇది పాన్ ఇండియా ప్రాజెక్టు కనుక ఐశ్వర్యను ఎంపిక చేసుకున్నట్టు సమాచారం. 'పొన్నియన్ సెల్వన్' చిత్రంలో ఐశ్వర్యరాయ్ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించింది. సెకండ్ పార్టులో ఆమె విలనిజంపై ఎక్కువ ఫోకస్ ఉంటుందని సమాచారం. మహేశ్ సినిమాలో ఆమె పాత్ర ఎలా ఉంటుందో చూడాలి మరి..



# విజయ్ జోడీగా త్రిష

**'మాస్టర్'** చిత్రం తర్వాత కథానాయకుడు, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాది అక్టోబరులో విడుదల కానున్న ఈ సినిమా టైటిల్ 'లియో'. టైటిల్ చూసి అభిమానులు ఎంతగానో సంతోషిస్తున్నారు. పద్నాలుగేళ్ల తరువాత విజయ్ జోడీగా త్రిష నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అర్జున్, ప్రియా ఆనంద్ మొదలైనవారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. లలిత కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
12 ఫిబ్రవరి, 2023


## మంచి ముత్యాలు

కడుపార అన్నం తిననివాడు మనసారా
ఆలోచించలేడు, ప్రేమించలేడు, నిద్రించలేడు.

- వర్జీనియా ఉల్ఫ్

## విషయ విశేషం

అరుదైన పుష్పం 'షిరుయ్ లిల్లీ'... 4
'సంఘీ'భావం....5
యుక్తప్రాయంలోనే ప్రాణాలు తీస్తున్న గుండెపోటు
కవర్ స్టోరీ..6
వెండితెర
కళాతపస్వి
ప్రేమ ఒక లక్ష్యం కావాలి!...11
పంచభూత లింగాలు....18
కథ.. 20
పుల్లేటిపల్లి పులితో..
ఈవారం కవిత్వం..26
పల్లె నీ కన్నతల్లే!
మనస్ఫూర్తిగా నవ్వాలి...27
కథా..కమామిషూ...29
కల సాకారం..30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## గాలిని శుద్ధి చేసే మొక్క



ఇంట్లో మొక్కలు పెంచుకోవడం వల్ల గాలి స్వచ్ఛత పెరుగుతుంది. స్నేక్ ప్లాంట్, మనీ ప్లాంట్.. ఇలా కొన్ని రకాల మొక్కల్ని ఇంట్లో పెంచుకుంటే ఆక్సిజన్‌ను ఎక్కువగా విడుదల చేస్తాయని పరిశీలనలు చెబుతున్నాయి. తాజాగా పారిస్‌కు చెందిన నియోప్లాంట్స్ అనే బయోటెక్ కంపెనీ, ఏకంగా జన్యు సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోథోస్ (మనీప్లాంట్) మొక్కలో అదనంగా కొన్ని జన్యువులను చేర్చింది. నియో-పి1గా పిలిచే ఈ మొక్క ఇంట్లో పెంచుకునే ముప్పై మొక్కలతో సమానమట. అంటే ఆ మొక్కలన్నీ పీల్చుకునే ఫార్మాల్డిహైడ్, బెంజీన్, టోలీన్, జైలీన్.. వంటి హానికర కర్బన పదార్థాలను ఇదొక్కటే తీసుకుంటుందట. మొక్కలో సహజంగా ఉన్న డీఎన్ఏకు అదనంగా కొన్ని జన్యువుల్ని చేర్చడం వల్ల అవి ఉత్పత్తి చేసే ఎంజైమ్‌లు ఆయా కర్బన పదార్థాలను పీల్చుకుని, హానిరహితంగా మార్చి మొక్క ఉపయోగించుకునేలా చేస్తున్నాయి. అంటే, ఈ మొక్కలు గాల్లోని ఫార్మాల్డిహైడ్‌ను ఫ్రక్టోజ్‌గా; బెంజీన్, టోలీన్ వంటి వాటిని అమైనో ఆమ్లాలుగా మార్చుకుంటాయి. కనుక ఇలాంటి ఓ మొక్క ఇంట్లో ఉంటే గాలి స్వచ్ఛత గురించి చింతించాల్సిన అవసరం ఉండదు అంటున్నారు.

### ధ్యానంతో మంచి బ్యాక్టీరియా?

బౌద్ధ సన్యాసులు శారీరకంగా ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసికంగా ప్రశాంతంగా కనిపిస్తారు. కారణం తెలుసుకునేందుకు కేంబ్రిడ్జి యూనివర్సిటీకి చెందిన నిపుణులు తొలిసారిగా వాళ్లని పరిశీలించారు. అందులో ధ్యానానికీ వాళ్ల పొట్టలోని బ్యాక్టీరియాకీ సంబంధం ఉందని తేలిందట. నిజానికి గత కొన్నేళ్లుగా ధ్యానం మానసిక, శారీరక ఆరోగ్యాన్ని ఏ విధంగా ప్రభావం చేస్తుందనే దానిమీద రకరకాల అధ్యయనాలు చేస్తున్నారు. కానీ కారణం స్పష్టంగా తెలియలేదు. అయితే పొట్టకీ, మెదడుకీ సంబంధం ఉందని ఇటీవలి పరిశోధనలు చెబుతున్నాయి. దీన్నిబట్టి గంటల సేపు ధ్యానం చేసే బౌద్ధుల పొట్ట మీద ఆ ప్రభావం ఉంటుందని భావించి, వాళ్ల పొట్టలోని మైక్రోబయోమ్ శాంపుల్స్‌ను పరిశీలించారట. ఎలాగంటే- బౌద్ధ సాధువుల్నీ, అదే ఆహారం తీసుకున్న ఇతర వ్యక్తులనీ పరిశీలించినప్పుడు బ్యాక్టీరియాలో వైవిధ్యం కొట్టొచ్చినట్టు కనిపించిందట. ధ్యానం చేసేవారిలో ఎక్కువగా ఉన్నాయట. ఇవి ఎక్కువగా ఉన్నవాళ్లలో మానసిక ఆరోగ్యం బాగుండి, డిప్రెషన్, ఆందోళన వంటివి తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.





# అరుదైన పుష్పం 'షిరుయ్ లిల్లీ'

సముద్ర మట్టానికి సుమారు మూడు వేల మీటర్ల దూరంలో ఉన్న షిరుయ్ కషంగ్ శిఖరం అత్యంత ప్రసిద్ధి చెందిన శిఖరం. చాలా ప్రధాన నదులు ఈ షిరుయ్ శిఖరం పగుళ్ల గుండా, వాలుల నుండి ఉద్భవించాయి. షిరుయ్ ఉఖ్రుల్ టౌన్ నుండి పద్దెనిమిది కి.మీ, ఇంఫాల్ నుండి వంద కి.మీ. దూరంలో ఉంటుంది. ఇది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన షిరుయ్ లిల్లీ పుట్టిన ప్రాంతం. షిరుయ్ లిల్లీ అనే పేరు బ్రిటిష్ వృక్ష శాస్త్రజ్ఞుడు ఎఫ్.కింగ్‌డమ్ వార్డ్ నుండి వచ్చింది. అతను ఈ లిల్లీ పువ్వు ప్రత్యేకతను కనుగొన్నాడు. స్థానిక ఇతిహాసాల ప్రకారం కషోంగ్ టిమ్రావోన్ కూడా షిరుయ్ శిఖరంపై నివసించే రక్షిత ఆత్మ అని అక్కడివారి నమ్మకం. ఈ అమూల్యమైన పుష్పాన్ని చూసేందుకు ప్రతి సంవత్సరం వేలాది



మంది శాస్త్రవేత్తలు, పర్యాటకులు వస్తుంటారు. సాధారణంగా కనిపించే షిరుయ్ లిల్లీ మే-జూన్ సమయంలో కొండపై వికసిస్తుంది. షిరుయ్ లిల్లీ ఫెస్టివల్ మణిపూర్ రాష్ట్రంలో వార్షిక కార్యక్రమం. ఇది మణిపూర్ టూరిజం డిపార్ట్‌మెంట్ ద్వారా నిర్వహించబడుతుంది. ఇది ఐదు రోజుల పాటు ఉల్లాసంగా జరుగుతుంది. ఈ పండుగకు కంటికి కనిపించేదానికంటే లోతైన ప్రాముఖ్యం ఉంది. ఇది మణిపూర్ ప్రభుత్వం తన పౌరులలో పర్యావరణ అవగాహనను పెంపొందించడానికి చేస్తున్న కృషి.

**షిరుయ్ లిల్లీ ఫెస్టివల్ అంటే ఏమిటి?**

ఈ లిల్లీ ఫెస్టివల్ మణిపూర్‌లోని వార్షిక సాంస్కృతిక కార్యక్రమం. సాధారణంగా మణిపూర్ రాష్ట్ర పుష్పం షిరుయ్ లిల్లీ పుష్పించే సీజన్‌లో మే నెలలో నిర్వహించబడుతుంది. ఇది లైవ్ మ్యూజిక్, జానపద నృత్యాలు, పాటలు, దేశీయ ఆటలు, స్థానిక ఆహారం, కళ, చేతిపనుల ప్రదర్శనలు, హస్తకళలు, మరెన్నో సాంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలతో కలిసి ఉంటుంది. షిరుయ్ లిల్లీ మణిపూర్ రాష్ట్ర పుష్పం, ఈ అరుదైన పుష్పం ఇరవయ్యవ శతాబ్దం మధ్య కాలం వరకు ఇక్కడ ఎవరికీ తెలీదు. ఇటీవలి సంవత్సరాలలో ఇది అంతరించిపోతున్న జాతిగా మారింది. ఉఖ్రుల్‌లోని షిరుయ్ కొండ మాత్రమే ఈ లిల్లీ పువ్వులు పెరిగే ప్రదేశం. అధిక పర్యాటకుల రద్దీ, బాధ్యతారహితమైన సందర్శనా పద్ధతుల కారణంగా, ప్రతి సంవత్సరం ఈ లిల్లీలు తక్కువ సంఖ్యలో పూస్తూ వస్తున్నాయి. ఈ లిల్లీ జాతిని సంరక్షించడానికి, షిరుయ్ లిల్లీ ఫెస్టివల్ సుస్థిరత, బాధ్యతాయుతమైన పర్యాటకానికి గుర్తుగా జరుపుకుంటారు. ●









# 'సంఘీ' భావం



## యుక్తప్రాయంలోనే ప్రాణాలు తీస్తున్న గుండెపోటు

సుమారు రెండు, మూడు దశాబ్దాల క్రితం గుండెపోటు అంటే కనీసం 55 సంవత్సరాలు దాటిన వారికే వచ్చేది. 50 సంవత్సరాలు దాటిన తరువాత గుండె పనితీరుకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించే వారు. అయితే గత దశాబ్దకాలంగా గుండెపోటు యుక్త వయస్సులో ఉన్న వారికి సైతం వస్తున్నాయి. మాజీ కేంద్ర మంత్రి దత్తాత్రేయ కుమారుడు వైష్ణవ్‌కు 21 ఏటనే గుండెపోటుతో మృతి చెందాడు. తిరుమల తిరుపతి దేవస్థానం ఇవో ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళి తన పెళ్లి కార్డులు పంచుతూ గుండెపోటుకు గురై ప్రాణాలు వదిలాడు. తాజాగా సినీ నటుడు తారకరత్న చిత్తూరులో నారా లోకేష్ పాదయాత్రకు హాజరై ఒక్కసారిగా కుప్పకూలి చికిత్స పొందుతున్నాడు. తెలంగాణలో ఇంటర్మీడియట్ పరీక్ష రాస్తున్న విద్యార్థి గుండెపోటుకు గురయ్యాడు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించేలోగానే మృతి చెందాడు. పాతబస్తీలో కొందరు యువకులు కబడ్డీ ఆడుతుండగా అందులో ఒక యువకుడు గుండెపోటుకు గురై మృతి చెందాడు, ఒకరిద్దరు కాదు పెద్ద సంఖ్యలోనే యువకులు గుండెపోటుకు గురౌతున్నారు. యుక్తవయస్సులోనే వీరి గుండెలు నీరసించి పోతున్నాయి. జన్యుపరమైన కారణాల కంటే ఎక్కువగా మారుతున్న జీవన విధానం వల్ల ఇలాంటి పరిస్థితి ఎదురౌతోందని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒక సంస్థ నిర్వహించిన సర్వేలో భారతదేశంలో సుమారు ఏడు కోట్ల మంది గుండెవ్యాధులతో చికిత్స పొందుతుండగా వారిలో రెండున్నర కోట్ల మంది 35 సంవత్సరాల లోపు వారు ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇది అనధికారికంగా అంతకు రెట్టింపు మంది యువకులు గుండెపోటు, హృద్రోగ సమస్యలతో సతమతం అవుతున్నారు. ప్రస్తుతం వివిధ కారణాలతో 40 సంవత్సరాల లోపు వారు చనిపోతుండగా వారిలో గుండెపరమైన సమస్యలతో చనిపోతున్న వారు 30 శాతం వరకు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. నిత్యం వ్యాయామం చేస్తున్న వారు కూడా గుండెపోటుకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. దీనికి కారణం మారుతున్న సమాజంలో యువత అలవాటు పడుతున్న ఆహారపు అలవాట్లు, వత్తిడిలు అని తెలుస్తోంది. ప్రధానంగా యువతకు గుండెపోటు రావడానికి అయిదు కారణాలు ప్రభావితం చేస్తున్నట్లు గుర్తించారు. అందులో ముందు వరసలో మానసిక వత్తిడి కారణంగా నిలిచింది. విద్యారంగంతో పాటు ఉద్యోగ, ఉపాధి రంగాల్లో కూడా ఇటీవల కాలంలో వత్తిడి పెరిగింది. విద్యార్థి దశ నుంచి 95 శాతానికి మించి మార్కులు సాధించాలన్న వత్తిడి పెరిగింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ మార్కుల ప్రాతిపదికన విద్యార్థులపై వత్తిడి తీసుకువస్తున్నారు. ఉదయం నాలుగున్నర గంటల నుంచే విద్యార్థుల దినచర్య ప్రారంభం అవుతుంది. తిండి కూడా సరిగ్గా తినేందుకు లేకుండా రాత్రి పది, పదిన్నర వరకు చదువుపైనే కాలం గడిచిపోతోంది. దీనితో విద్యార్థులు తీవ్ర వత్తిడికి గురౌతున్నారు. అప్పటి నుంచే వీరి గుండె బలహీన పడటం ప్రారంభిస్తోంది. వందకు వంద మార్కులు సాధించి నెలకు లక్షలాది రూపాయల ఆదాయం పొందడం విషయాన్ని అటుంచితే 30 సంవత్సరాల వరకు ఆ విద్యార్థి బతికి ఉంటాడా అన్న అనుమానం కలుగుతోంది. మరోపక్క చదువే ప్రధాన లక్ష్యం కావడంతో సరైన తిండి లభించడం లేదు. త్వరగా భోజనం కానివ్వాలన్న తపనతో జంక్‌ఫుడ్స్ వైపు విద్యార్థులు దృష్టి సారిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా టిఫిన్ బాక్స్‌లో జంక్ ఫుడ్స్ నింపి ఇస్తున్నారు. ఏమైనా చెబితే మా బాబు ఇవి తప్ప భోజనం చేయడానికి ఇష్టపడడు అంటూ తమ హోదాను, స్థాయిని ప్రదర్శించే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఆధునిక యుగంలో ఎలక్ట్రానిక్ పరికరాలు ఒక శాపంగా మారాయి. రెండేళ్ల నుంచి సెల్‌ఫోన్‌కు పిల్లలు అతుక్కుని పోతున్నారు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకోబోయే వరకు కనీసం ఐదారు గంటలు ఫోన్‌తోనే కాలక్షేపం చేస్తున్నారు. అన్నం తినిపించడానికి తల్లిదండ్రులే సెల్‌ఫోన్‌లో వీడియోలు సెలక్ట్ చేసి పిల్లల ముందు పెడుతున్నారు, చిన్నప్పటి నుంచే ఎటువంటి వ్యాయామం లేకుండా తలదించుకుని సెల్‌ఫోన్ చూస్తూ పిల్లలు పెరుగుతున్నారు. ఈ విధానం వల్ల ఒక్క గుండె జబ్బులు మాత్రమే కాదు, ఊబకాయం, మతిమరుపు, ఏ విషయంపైనా శ్రద్ధ లేకపోవడం వంటి అనేక రుగ్మతలు చిన్నారులను వెంటాడుతున్నాయి. ఇక ఒక వయస్సు వచ్చిన తరువాత ధూమపానం, మద్యం సేవించడం ఒక స్టేటస్ సింబల్‌గా మారింది. ఇటీవల కాలంలో గంజాయి, డ్రగ్స్ అందుబాటులో రావడంతో యువత త్వరగా పెడమార్గాన్ని అనుసరిస్తున్నారు. పబ్‌లలో బాహాటంగానే డ్రగ్స్ ఇస్తున్నారు. చాలా మంది యువత రాత్రి కాగానే మత్తులో జోగుతున్నారు. ఇంజనీరింగ్, మెడికల్, బిజినెస్ స్కూల్స్, కళాశాలల వద్ద గంజాయి అమ్మే ముఠాలు పెరిగిపోతున్నారు. సాధారణ సిగరెట్టు ఎవరైనా తాగుతారు...గంజాయి తాగితే అ మజాయే వేరుగా ఉంటుందని, గంజాయి తాగితే ఒక హీరోగా చలామణి అవుతామన్న చెడు భావన యువతలో స్పష్టంగా కనిపిస్తోంది. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఇంట్లో పెద్దలు పిల్లల మనస్తత్వాన్ని గమనించే వారు. ప్రస్తుతం చిన్న చిన్న కుటుంబాలు ఫ్యాషన్‌గా మారాయి. తల్లిదండ్రులు ఉద్యోగాల పేరుతో బయటకు వెళ్లి రాత్రికి తిరిగి వస్తారు. అప్పటి వరకు చిన్న పిల్లలు ఇంట్లోనే ఒంటరిగా గడుపుతూ ఉంటారు. ఈ సమయంలో వారు ఫోన్లలో ఏయే వీడియోలు చూస్తున్నారు...? ఎలా ప్రవర్తిస్తున్నారు? అన్న విషయం తెలియడంలేదు. జీవన విధానంలో మార్పులువస్తేనేగాని హృద్రోగాల నుంచి ఉపశమనం పొందే అవకాశాలు లేవని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

తెలుగు సినీ ప్రపంచంలో ప్రతి ఒక్కరి హృదయాలను అలరించిన దర్శక దిగ్గజం కాశీనాథుని విశ్వనాథ్. తల్లిదండ్రులు పెట్టిన పేరు కాశీనాథుని విశ్వనాథ బాబు. స్వయంకృషితో చిన్నస్థాయి నుండి దర్శక దిగ్గజంగా ఎదిగిన కళాతపస్వి. ప్రొడక్షన్ మేనేజర్‌గా చేరి, సౌండ్ రికార్డింగ్ అసిస్టెంట్‌గా సినీ ప్రస్థానం మొదలు పెట్టి, సహాయ దర్శకుడిగా పనిచేసి, చివరకు దర్శకుడిగా

# వెండితెర కళాతపస్వి



పలు చిత్రాలు తీసి, జాతీయ స్థాయిలో తెలుగు సినిమాకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చి, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సంస్కృతీ, సంప్రదాయాలకు కళాతపస్వి కె.విశ్వనాథ్ పెద్ద పీట వేశారు. దర్శకత్వ శాఖలో తనదైన శైలిలో ప్రజల హృదయాలపైముద్ర వేసిన ఈ దర్శక దిగ్గజం 2023 ఫిబ్రవరి 3వ తేదీన వయోభారంతో, వృద్ధాప్య అనారోగ్య కారణాల వల్ల తన 92వ ఏట హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఈ నేపథ్యంలో కళాతపస్వి కె.విశ్వనాథ్ జీవిత విశేషాలను ఒకసారి గుర్తుకు చేసుకుందాం.

### బాల్యం-విద్యాభ్యాసం

విశ్వనాథ్ బాపట్ల జిల్లా రేపల్లెలో కాశీనాథుని సుబ్రహ్మణ్యం, సరస్వతి దంపతులకు 1930 ఫిబ్రవరి 19న మొదటి సంతానంగా జన్మించారు. ఆయనకు ఇద్దరు చెల్లెళ్లు. ఇదే జిల్లాలోని భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు గ్రామంలో ఈ కుటుంబం స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. ఈ గ్రామానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. కృష్ణా తీరంలో ఒకప్పుడు వ్యాఘ్రపురంగా చారిత్రక ప్రసిద్ధి గాంచిన ఈ గ్రామం ఎందరో ఉద్దండులకు పేరుగాంచిన గ్రామం పెదపులివర్రు. సమరయోధులకు పెదపులివర్రు గ్రామం నిలయంగా ఉండేది. సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ఈ గ్రామం అల్లుడే. సినీగేయ రచయిత సముద్రాల రాఘవాచారి, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మేనమామ ములుగు కుమారస్వామి, కంచి కామకోటి పీఠాధిపతులు ఆది శంకరాచార్యులు రాసిన వ్యాకరణాన్ని తెలుగులో అనువదించిన వారణాసి సుబ్బయ్య ఈ గ్రామానికి చెందినవారే. నేటి తరానికి చెందిన తానా మాజీ అధ్యక్షుడు నాదెళ్ల గంగాధర్, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తాజ్వాల ఈ గ్రామానికి చెందినవారే. అనేకమంది ప్రముఖుల బాల్యం ఈ గ్రామంలో గడిచింది. పాత తరంవారి ప్రభావం విశ్వనాథ్‌పై ఎంతో ఉందని చెప్పవచ్చు. విశ్వనాథ్ తండ్రి కాశీనాథుని సుబ్రహ్మణ్యం పెదపులివర్రు శివాలయంలో ప్రధాన అర్చకులుగా 1956 వరకు పనిచేశారు. సుబ్రహ్మణ్యం వృత్తిరీత్యా విజయవాడకు మకాం మార్చారు. కొంత కాలానికి సినీ నిర్మాణ సంస్థ వాహినిలో ఉద్యోగం రావటంతో ఆయన మకాం చెన్నైకు మారింది. విశ్వనాథ్ నాల్గవ తరగతి వరకు పెదపులివర్రు గ్రామంలోనే చదివారు. గుంటూరు హిందూ కళాశాలలో 1945లో ఇంటర్మీడియట్, ఆ తరువాత ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేసారు. ఎంత ఎదిగినా విశ్వనాథ్ తన సొంత ఊరు పెదపులివర్రును మురవలేదు. పలు సందర్భాలలో దసరా, మహాశివరాత్రి పర్వదినాలకు స్వామివార్లతో పాటు బాల్యమిత్రులకు పట్టువస్త్రాలు పంపేవారు. విశ్వనాథ్ పదో ఏట ఆ కుటుంబం విజయవాడకు మకాం మార్చారు. విశ్వనాథ్ తాత కాళహస్తిలింగం స్వాతంత్ర్య సమరయోధుడే కాక గొప్ప పండితుడు కూడా. 1930లో ఆయన కాంగ్రెస్ కార్యకర్తకు ఆతిథ్యం ఇచ్చినందుకు ఆరు మాసాల పాటు జైలుశిక్షను అనుభవించారు. ఆయన జైల్లో భోజనాన్ని నిరాకరించడంతో ఆలీపురం క్యాంపు జైలుకు పంపారు. అక్కడ కూడా అన్నపానీయాలు లేకుండా నిత్య సంధ్యానుష్టానాలు జరుపుకున్నారు. కారాగార వైద్యుడు వీరి గురించి తెలుసుకుని గోధుమపిండి, పాలు,

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్‌హకీం జాని

నూనె ఇత్యాది వాటిని సమకూర్చారు.

## సినీ ప్రస్థానం

తండ్రి చెన్నైలోని విజయవాహినీ స్టూడియోలో పని చేస్తూ మేనేజర్ స్థాయికి ఎదిగారు. దీంతో విశ్వనాథ్ సినిమాలపై మోజు పెంచుకున్నారు. డిగ్రీ పూర్తి చేయగానే వాహినీ స్టూడియోలో చేరాలని నిర్ణయించుకున్నారు. వాహినిలో తండ్రి పని చేస్తున్నప్పటికీ ఘంటసాల మాస్టారు ద్వారా వాహినీ స్టూడియోలో తొలుత ప్రొడక్షన్ మేనేజర్‌గా చేరి సినీ జీవితానికి శ్రీకారం చుట్టారు విశ్వనాథ్. ఆ తరువాత సౌండ్ ఇంజినీరుగా మరో శాఖకు బదిలీ అయ్యారు. ఆ సమయంలోనే బి.ఎన్.రెడ్డి, కేవి రెడ్డి, దుక్కిపాటి మధుసూదనరావు, తాతినేని ప్రకాశరావు, ఆదుర్తి సుబ్బారావు, భానుమతితో పాటు ఆమె భర్త రామకృష్ణ ఇత్యాది ఎందరో ప్రముఖులతో విశ్వనాథ్‌కు పరిచయాలు ఏర్పడ్డాయి. సినిమా నిర్మించే టప్పుడు ఎవరి సాంకేతిక నిపుణులు వారికి ఉన్నప్పటికీ రికార్డింగ్‌కు వాహినీ స్టూడియో వారే ఇచ్చేవారు. రికార్డింగులో కొంత సృజనాత్మకత చూపించి విశ్వనాథ్ అంద రినీ ఆకట్టుకునేవారు. ఆయన సృజనను, తపనను తొలిసారిగా గుర్తించిన వ్యక్తి అక్కినేని నాగేశ్వరరావు తనను అన్నపూర్ణ సంస్థకు తీసుకుని వచ్చారని విశ్వనాథ్ పలు ఇంటర్వ్యూలలో చెప్పుకున్నారు. విశ్వనాథ్ 'పాతాళభైరవి' సినిమాకు సహాయక రికార్డిస్ట్‌గా చలనచిత్ర జీవితానికి శ్రీకారం చుట్టారు. ఆమీదట అప్పటి ప్రముఖ దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు వద్ద సహాయకుడిగా చేరారు. ఆయన శిష్యరికంలో కొన్ని చిత్రాలలో కథారచనలో సైతం పాలు పంచుకున్నారు. వాహినీ స్టూడియోలో సౌండ్ రికార్డింగ్ విభాగంలో కె.విశ్వనాథ్ కెరీర్ ప్రారంభించారు. బి.ఎన్.రెడ్డి, కె.వి.రెడ్డి, ఆదుర్తి సుబ్బారావు లాంటి వాళ్ల పనితీరును సన్నిహితంగా పరిశీలిస్తూ వచ్చిన కె.విశ్వనాథ్ స్క్రిప్టులో తోచిన సలహాలు, సూచనలు ఇస్తుండేవారు. ఆదుర్తి తన సినిమాలకు స్క్రిప్ట్ అసిస్టెంట్‌గా, అసోసియేట్‌గా పని చేసే అవకాశం ఆయనకిచ్చారు. అలా ఆదుర్తి వద్ద సహాయ దర్శకుడి రూపంలో దర్శకత్వ శాఖలోకి ప్రవేశించి అనేక మెళకువలు నేర్చుకుని కథ, స్క్రీన్‌ప్లే, రచన, సెకండ్ యూనిట్ డైరెక్షన్.. ఇలా అనేక విభాగాలలో విశ్వనాథ్ పనిచేశారు.

## సూపర్ స్టార్ కృష్ణకు శిక్షణ



అప్పట్లో బాబూ మూవీస్ నూతన తారలతో ప్రయోగాత్మకంగా తీసిన తొలి సాంఘిక ఈస్ట్‌మన్ కలర్ చిత్రం 'తేనెమనసులు'. ఈ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు. విశ్వనాథ్ సహాయ దర్శకుడు. తెనాలి సమీపంలోని బుర్రిపాలెం గ్రామానికి చెందిన ఘట్టమనేని కృష్ణకు హీరోగా అది తొలి చిత్రం. ఆ సినిమాకోసమని కృష్ణకు నడకలో, వాచకం లో శిక్షణనిచ్చింది విశ్వనాథ్ కావడం విశేషం. వారిద్దరి అనుబంధం ఆ తరువాత కూడా కొనసాగింది. కృష్ణతో 'కన్నెమనసులు' తీశారు. ఆ తరువాత 'ప్రైవేటు మాస్టర్' చిత్రంలో కృష్ణను నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో చూపించారు. ఆ మీదట 'ఉండమ్మా బొట్టు పెడతా', 'నేరము-శిక్ష' మొదలైన చిత్రాలకు సూపర్‌స్టార్ కృష్ణతో పనిచేశారు. తెనాలికి చెందిన మరో



సి.ఎం.కెసిఆర్‌తో విశ్వనాథ్ కుటుంబం

నటీమణి ఊర్వశి శారద హీరోయిన్‌గా 'శారద' చిత్రానికి విశ్వనాథ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి తెనాలికి చెందిన అభ్యుదయ రచయిత బొల్లిముంద శివ రామకృష్ణ సంభాషణలు సమకూర్చారు. బొల్లిమంత కన్ను మూసిన తరువాత ఆయన పేరుతో ఇస్తున్న పురస్కారాన్ని 2002లో కె.విశ్వనాథ్ తెనాలికి వచ్చి అందుకోవడం విశేషం.

## తొలి చిత్రం 'ఆత్మగౌరవం'

కథా విస్తరణ, స్క్రీన్‌ప్లే రచనలో విశ్వనాథ్‌కు ఉన్న ప్రతిభను ఆదుర్తి వద్ద పని చేస్తున్నప్పుడు గుర్తించి, ఆయనను వాహినీ వదిలేసి, తమ అన్నపూర్ణా పిక్చర్స్ సంస్థలోకి, పూర్తిగా దర్శకత్వ శాఖలోకి రమ్మని ప్రోత్సాహించింది హీరో అక్కినేని నాగేశ్వరరావు. విశ్వనాథ్ ప్రతిభను గుర్తించిన దుక్కిపాటి మధుసూదనరావు 'ఆత్మగౌరవం' చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశమిచ్చి పూర్తిస్థాయి దర్శకుడిని చేశారు. అన్నపూర్ణ సంస్థలో ఆదుర్తి సుబ్బారావు వద్ద రెండు సినిమాలకు సహాయకుడిగా పనిచేసిన తరువాత దర్శకుడిగా అవకాశమిస్తానని నాగేశ్వరరావు మాట ఇచ్చారు. ఆ కారణంగా 1961లో విడుదలైన 'వెలుగునీడలు'; 'ఇద్దరు మిత్రులు', 'చదువుకున్న అమ్మాయిలు '(1963), 'డాక్టర్ చక్రవర్తి' (1964) మొదలైన నాలుగు సినిమాలకు దర్శకత్వం శాఖలో పనిచేశారు. నిజానికి 'పూలరంగడు' చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యత విశ్వనాథ్‌కు వచ్చింది. స్క్రిప్టుపనులు కూడా చేయించారు. ఆ తరువాత ఆ అవకాశం ఆదుర్తి సుబ్బారావుకు దక్కింది. అయితే 1965లోనే 'ఆత్మగౌరవం' చిత్రం ద్వారా విశ్వనాథ్‌కు దర్శకుడిగా అవకాశం వచ్చింది. ఆ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు హీరోగా నటించారు. తొలి చిత్రం విజయం సాధించడంతో అవకాశాలు బాగా వచ్చాయి. 'చెల్లెలి కాపురం', 'ఓ సీత కథ', 'కాలం మారింది', 'శారద', 'జీవనజ్యోతి' ఇలా.. విశ్వనాథ్ సినీ ప్రస్థానం శరవేగం అందుకుంది. ఆ తరువాత తెలుగు చిత్రాలకు నవోదయంగా నిలిచిన 'శుభోదయం', సామాజిక రుగ్మతల సంస్కరణకి పరమావధిగా నిలిచిన 'సప్తపది', సంప్రదాయ సంగీతం, నృత్య ప్రధానంగా సాగిపోయిన 'సిరిసిరిమువ్వ' చిత్రం అద్భుత విజయాలను సాధించి ప్రత్యేకమైన గుర్తింపు పెట్టాయి. 'శంకరాభరణం', 'సాగర సంగమం', 'శృతిలయలు', 'సిరివెన్నెల', 'స్వర్ణకమలం', 'స్వాతికిరణం', 'స్వరాభిషేకం' తదితర సినిమాల్లో శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నృత్యాలకు పెద్దపీట వేశారు.

సినీ ప్రపంచ కంఠాభరణం 'శంకరాభరణం' 'సిరిసిరిమువ్వ' తరువాత దర్శకత్వం వహించిన 'శంకరాభరణం' భారతీయ సినీ ప్రపంచానికి ఓ కంఠాభరణంగా నిలిచింది. సంగీతం ప్రధానమైన ఈ చిత్రాన్ని ఇతర రాష్ట్రాలవారు, ఇతర భాషలవారు సైతం ఆదరించి నీరాజనాలు పట్టారు. విశ్వనాథుని కీర్తి ఖండాంతరాలకు వ్యాపించింది. పాశ్చాత్య సంగీత పెను తుపాను తాకిడికి రెపరెపలాడిపోతున్న సత్సంప్రదాయ సంగీత జ్యోతిని చేతులొడ్డి కాపాడుకోవాలనే సంకల్పాన్ని కలిగించే అద్భుతమైన దృశ్యా కావ్యం శంకరాభరణం. ఆచార వ్యవహారాలకంటే మానవత్వం గొప్పదని శంకరాభరణం చిత్రంలో చాటిచెప్పారు. అందుకే ఆ చిత్రం జాతీయ పురస్కారం అందుకుంది. 1981లో ఫ్రాన్స్‌లో జరిగిన చలనచిత్రోత్సవం లో ప్రేక్షకుల ప్రత్యేక పురస్కారం కూడా అందుకుంది. అన్నిటికంటే తెలుగు సినీ అభిమానులు గర్వంగా చెప్పుకునే ఓ గొప్ప చిత్రంగా అందరి హృదయాలలో శంకరాభరణం నిలిచి పోయింది. వరకట్న సమస్యని సునిశిత హాస్యంతో మేళవించి 'శుభలేఖ' చిత్రంలో చూపించారు. ఎంత ఉన్నతమైన వ్యక్తి అయినా అసూయాద్వేషాలు అధః పాతాళానికి దిగజారుస్తాయని 'స్వాతి కిరణం'లో కళ్లు తెరిపించే సందేశం ఇచ్చారు.

అనంతరం వచ్చిన అనేక చిత్రాలలో సరికొత్త ప్రయోగాలు చేస్తూ భారతీయత ఉట్టిపడే సన్నివేశాలతో అందరినీ ఆకట్టుకున్నారు. 'సిరివెన్నెల' చిత్రంలో హీరోకు కళ్లు కనిపించవు. హీరోయిన్ మూగది. ఎంతో సాహసంతో చేసిన ఈ చిత్రం ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుని ప్రజల ప్రశంసలందుకుంది. కులవ్యవస్థను చెరిపివేయాలని 'సప్తపది' స్పష్టం చేస్తే, చేసే పని తపస్సయితే అదే మనల్ని ఉన్నత స్థాయికి తీసుకువెళుతుందని 'స్వయంకృషి' చెబుతుంది. అవినీతి, అక్రమాలను ఎదుర్కొన దానికి హింస మార్గం కాదని, శాంతియుత మార్గమే ఉత్తమమని 'సూత్రధారులు' చిత్రంలో తెలియజెప్పారు. నృత్య ప్రధానమైన 'సాగర సంగమం', 'శ్రుతిలయలు', 'సూత్రధారులు', 'ఆపద్బాంధవుడు', 'శుభ సంకల్పం' ఇలా.. ఒకదాన్ని మించి మరో చిత్రమన్నట్లు విశ్వనాథ్‌ను ఎవరెస్ట్ ఎత్తుకు తీసుకుని వెళ్లాయి. 'చెల్లెలి కాపురం' (1971), 'కాలం మారింది' (1972), 'నేరము–శిక్ష' (1973), 'ఓ సీత కథ' (1974), 'సిరిసిరిమువ్వ' (1976), 'శంకరాభరణం' (1980), 'సప్తపది'(1981), 'శుభలేఖ'(1982), 'స్వాతిముత్యం'(1985), 'సిరివెన్నెల'(1986), 'స్వాతికిరణం'(1992) ఇలా.. వైవిధ్యమైన కథాంశాలతో దాదాపు యాభై చిత్రాలకు పైగా దర్శకత్వం వహించారు.



ఏపి సిఎం జగన్‌తో విశ్వనాథ్

## కలిసొచ్చిన 'ఎస్'

విశ్వనాథ్ యాభై చిత్రాలకు దర్శకత్వం వహించగా వాటిలో 'ఎస్' అక్షరంతో ప్రారంభమైన చిత్రాలన్నీ విశేష ఆదరణ పొందాయి. 1973లో తెరకెక్కిన 'శారద', తరువాత సిరిసిరిమువ్వ, సీతామాలక్ష్మి, శంకరాభరణం, శుభోదయం, సప్తపది, శుభలేఖ, సాగర సంగమం, స్వాతిముత్యం, సిరివెన్నెల, స్వయంకృషి, స్వర్ణకమలం, సూత్రధారులు, స్వాతికిరణం, శుభసంకల్పం, స్వరాభిషేకం, శుభప్రదం ఇలా.. 'ఎస్' అనే అక్షరంతో మొదలైన చిత్రాలు విజయపథంలో నడిచాయి. ఒక సందర్భంలో విశ్వనాథ్ మాట్లాడుతూ– "తానెప్పుడూ కథకు తగ్గ పేర్లే సినిమాకు పెడతానని, ఎస్ అనే పేరుతో సినిమా టైటిల్ పెట్టాలనేది ఉద్దేశ పూర్వకంగా వచ్చింది కాదని, కాకతాళీయంగా 'ఎస్' పేరుతో సినిమా టైటిల్ ప్రారంభయ్యేదని" వివరణ ఇచ్చారు.

## పాటల పల్లవులు విశ్వనాథ్‌వే..

విశ్వనాథ్‌లో బాహ్య ప్రపంచానికి తెలియని ఓ అద్భుత సినీ గీత రచయిత ఉన్నారు. ఆదుర్తి సుబ్బారావు వద్ద సహాయ దర్శకుడిగా పని చేస్తున్న కాలంలో గీత రచయితలతో పాటలు రాయించే సమయంలో ఇన్‌పుట్‌గా విశ్వనాథ్ పాటల పల్లవులు అందించేవారు. 'డమ్మీ లిరిక్స్.. అబద్ధపు సాహిత్యం' అంటూ ఆయన ఇచ్చిన పల్లవులే తలమానికమైన ఎన్నో సినీ గేయాకు కిరీటాలయ్యాయి. 'ఆత్మగౌరవం' చిత్రంలో 'మా రాజులొచ్చారు', 'అందెను నేడే అందని జాబిల్లి' ఇత్యాది పాటల పల్లవులు విశ్వనాథ్ రాసినవే. ఆ పదాలకు మరింత సొబగులద్ది గేయరచయితలు మిగిలిన పాటంతా అద్భుతంగా అల్లడం విశేషం.

## శోభన్‌బాబుతో విజయాలు

చాలామంది విశ్వనాథ్ పేరు చెప్పగానే కమల్‌హాసన్‌తో పలు విజయాలున్నాయి అంటుంటారు. దానికి ముందు శోభన్ బాబుతో అనేక హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించి విశ్వనాథ్ ఎన్నో విజయాలు చవిచూశారు. వీరిద్దరి చిత్రాలు వరుసగా రావడం ఒక చరిత్రగా చెప్పవచ్చు. 'చెల్లెలి కాపురం'(1971), 'కాలం మారింది' (1972), 'శారద'(1973) ఇత్యాది చిత్రాలు అరుదైన రికార్డులు సొంతం చేసుకున్నాయి. ఈ చిత్రాలతో పాటు 1975లో వచ్చిన 'జీవనజ్యోతి' చిత్రం కూడా బంగారు నందులను కైవసం చేసుకోవడం



గౌరవ డాక్టరేట్‌ను పొందిన విశ్వనాథ్

అరుదైన రికార్డ్. విభిన్న చిత్రాలకు దర్శకత్వం వహించిన విశ్వనాథ్ కుటుంబ కథా చిత్రాల కథానాయకుడు శోభన్‌బాబు కలసి నాలుగు బంగారు నంది పురస్కారాలను అందుకుని అరుదైన రికార్డును సొంతం చేసుకుని గోల్డెన్ కాంబినేషన్ అని ప్రశంసలందుకున్నారు. శోభన్‌బాబు ఈ నాలుగు చిత్రాలే కాకుండా ఆయన కథానాయకుడిగా నటించిన 'ప్రేమబంధం', 'జీవితనౌక', 'కాలాంతకులు' కూడా ఉన్నాయి. ఈ మూడు చిత్రాలు వసూళ్ల పరంగా యావరేజ్ స్థాయిలో నిలిచాయి. ఇవి కాకుండా ఎన్టీఆర్‌తో పాటు మరో హీరోగా నటించిన శోభన్‌బాబు నటించిన 'చిన్ననాటి స్నేహితులు', 'నిండు హృదయాలు', 'ప్రైవేటు మాస్టారు' చిత్రాలలో శోభన్ అతిథి పాత్రల్లో నటించారు. ఇలా వీరిద్దరి కాంబినేషన్‌లో మొత్తం పది చిత్రాలు వచ్చాయని చెప్పవచ్చు. అంటే అతిథి పాత్రలను కలుపుకుంటే విశ్వనాథ్‌తో అత్యధిక చిత్రాలలో నటించిన ఘనత శోభన్‌బాబుతో దక్కుతుంది.

**ఇతర హీరోలతో కూడా**

విశ్వనాథ్ అనేక చిత్రాలు చేశారు. సూపర్‌స్టార్ కృష్ణ నటించిన 'ఉండమ్మా బొట్టు పెడతా', 'నేరము-శిక్ష' చిత్రాలకు దర్శకత్వం వహించగా అవి సూపర్‌హిట్ అయ్యాయి. కృష్ణంరాజు నటించిన 'అల్లుడు పట్టిన భరతం', మెగాస్టార్ చిరంజీవి నటించిన 'శుభలేఖ', 'స్వయంకృషి', 'ఆపద్బాంధవుడు'; హీరో బాలకృష్ణ నటించిన 'జననీ జన్మభూమి', వెంకటేష్ నటించిన 'స్వర్ణకమలం', 'కమల్‌హాసన్'తో 'సాగర సంగమం', 'స్వాతిముత్యం', 'శుభసంకల్పం', పరభాషా నటుడు సర్వదమన్ బెనర్జీ నటించిన 'సిరివెన్నెల', మళయాళంలో అగ్రహీరో మమ్ముట్టి నటించిన 'స్వాతికిరణం', రాజశేఖర్ నటించిన 'శృతిలయలు' ఇత్యాది అగ్రహీరోలు నటించిన అనేక చిత్రాలకు విశ్వనాథ్ దర్శకత్వం వహించారు. సీతారామశాస్త్రిని సిరివెన్నెల సినిమాతో గీత రచయితగా పరిచయం చేయగా ఆయన ఇంటిపేరు చాలా మందికి తెలియదు. అందరూ సిరివెన్నెల సీతారామశాస్త్రి అని పిలుస్తున్నారు.

విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రాలు ఆత్మగౌరవం(1965), ప్రైవేట్ మాస్టర్(1967), కలిసొచ్చిన అదృష్టం (1968), ఉండమ్మా బొట్టు పెడతా (1968), నిండు హృదయాలు(1969), చెల్లెలి కాపురం(1971), చిన్ననాటి స్నేహితులు(1971), కాలం మారింది (1972), శారద(1973), నేరము-శిక్ష (1973), అమ్మమనసు (1974), ఓ సీత కథ(1974), జీవనజ్యోతి(1975), మాంగల్యానికి మరో ముడి(1975), సిరిసిరిమువ్వ (1976), ప్రేమబంధం (1976), జీవితనౌక(1976), కాలాంతకులు (1978), సీతామాలక్ష్మి(1978), ప్రెసిడెంట్ పేరమ్మ(1979), శంకరాభరణం(1980), అల్లుడు పట్టిన భరతం (1980), శుభోదయం(1980), సప్తపది(1981), శుభలేఖ(1982), సాగర సంగమం (1983), జననీ జన్మభూమి(1984),



స్వాతిముత్యం(1986), శృతిలయలు (1987), స్వయంకృషి (1987), స్వర్ణకమలం (1988), సూత్రధారులు (1989), స్వాతికిరణం (1992), శుభసంకల్పం (1995), చిన్నబ్బాయి (1997), స్వరాభిషేకం(2004), శుభప్రదం(2010) మొదలైన చిత్రాలకు దర్శకత్వం వహించారు. వీటిలో పాతిక చిత్రాలకు విశ్వనాథ్ కథ, స్క్రీన్‌ప్లే కూడా సమకూర్చగా, మరో అయిదు చిత్రాలకు స్క్రీన్‌ప్లే ఆయనే అందించారు.

దర్శకత్వం వహించిన హిందీ చిత్రాలు

విశ్వనాథ్ తెలుగు చిత్రాలే కాక హిందీ చిత్రాలకు కూడా దర్శకత్వం వహించారు. పలు తెలుగు చిత్రాలను తిరిగి హిందీలో దర్శకత్వం వహించి పునర్నిర్మించారు. 'సర్గం'(సిరిసిరిమువ్వ-1979), 'కామ్ చోర్'(శుభోదయం-1982), 'శుభ్ కామ్నా'(శుభలేఖ-1983), 'జాగ్ ఉఠా ఇన్సాన్'(సప్తపది-1984), 'సన్‌జోగ్'(జీవనజ్యోతి-1985), 'సుర్ సంగం'(శంకరాభరణం-1985), 'ఈశ్వర్'(స్వాతిముత్యం-1989), 'సంగీత్'(1992), ధన్వాన్(1993), ఔరత్ ఔరత్ ఔరత్(1996) ఇత్యాది హిందీ చిత్రాలకు విశ్వనాథ్ దర్శకత్వం వహించారు.

**నటుడిగా కె.విశ్వనాథ్**

దర్శకుడిగానే కాక నటుడిగా కూడా విశ్వనాథ్ రాణించి ప్రజల ప్రశంసలందుకున్నారు. పూర్తి స్థాయి నటుడిగా కాకముందు విశ్వనాథ్ కొన్ని సెకన్లపాటు సినిమాలలో కనిపించీ కనిపించనట్లు జనంలో కలిసి ఉన్నారు. ఎంతో దీక్షగా చూస్తే తప్పితే ఈయన విశ్వనాథ్ అని గుర్తిపట్టలేం. 'సిరివెన్నెల' చిత్రం ప్రారంభమైన ఇరవై నిమిషాల తరువాత హీరో తన చెల్లెలితో "ఒక్కసారి మన ఊరిగుడి, దేవుడ్ని చూసొస్తాను" అని డైలాగ్ చెబుతాడు. వారిద్దరి పక్కన ఖాకీ దుస్తుల్లో విశ్వనాథ్ అటువైపుకు తిరిగి దుకాణంలో ఏదో కొనుగోలు చేస్తున్నట్లు కనిపిస్తారు. అయితే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చొరవతో పూర్తి స్థాయి నటుడిగా మారారని చెప్పవచ్చు. బాలు నిర్మాతగా 'శుభ సంకల్పం' చిత్రంలో రాయుడు పాత్ర చాలా కీలకమైంది. చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. కానీ రాయుడు పాత్రకు ఎవరనేది తేలలేదు. "మీరు ఆ పాత్ర వేస్తేనే సినిమా చేద్దాం. లేకపోతే మానేద్దాం" అని బాలు ఖరాఖండిగా చెప్పారు.

చివరకు యూనిట్ అంతా చెప్పడంతో తొలిసారిగా విశ్వనాథ్ ముఖానికి రంగు వేసుకుని రాయుడు పాత్రలో నటించారు. ఆ తరువాత తండ్రి, తాత, ఊరి పెద్ద.. ఇలా ఒకటేమిటి.. అనేక పాత్రల్లో తెలుగు ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

తెలుగుతో పాటు తమిళం, కన్నడ చిత్రాలలో సైతం ఆయన నటుడిగా పేరు తెచ్చుకున్నారు.

నటించిన తెలుగు చిత్రాలు
శుభ సంకల్పం(1995), వజ్రం(1995), కలిసుందాం రా(2000), నరసింహనాయుడు(2001), నిన్ను చూడాలని(2001), సీమసింహం(2002), నువ్వు లేక నేను లేను(2002), సంతోషం(2002), లాహిరి లాహిరి లాహిరిలో(2002), నీ స్నేహం(2002), అల్లరి రాముడు(2002), ఠాగూర్(2003), లక్ష్మీ నరసింహ(2004), స్వరాభిషేకం(2004), దోస్త్(2004), అతడు(2005), శ్లోకం(2005), ఆడవారి మాటలకు అర్థాలే వేరులే(2007), పాండురంగడు(2008), మిస్టర్ పర్‌ఫెక్ట్(2011), దేవస్థానం(2012), గ్రీకువీరుడు (2013), హైపర్(2016) ఇత్యాది చిత్రాలలో నటించారు.

## నటించిన తమిళ చిత్రాలు

కురుతి పునల్(1995), ముగవరి(1999), కాక్కై సిరగినిలె(2000), బగవతి(2002), పుదియ గీతై(2003), యారడి నీ మోహిని(2008), రాజపాట్టై(2011), సింగం-2(2013), లింగా(2013), ఉత్తమ విలన్(2015) ఇత్యాది తమిళ చిత్రాల్లో విశ్వనాథ్ నటించారు.
వీటితో పాటు 2018లో విడుదలైన 'ప్రేమ బరహ' అనే కన్నడ చిత్రంలోనూ నటించారు.

## సెట్‌లో ఖాకీ దుస్తులు

విశ్వనాథ్ మొదటి చిత్రం నుండి సెట్‌లో ఖాకీ దుస్తులు ధరించేవారు. సెట్‌లో ఖాకీ దుస్తులు ఎందుకు ధరిస్తారని విశ్వనాథ్‌ను అడిగితే "మొదటి సినిమా సరిగ్గా ఆడక పోతే టాక్సీ డ్రైవర్‌గా మారిపోతా. అప్పుడు ఖాకీ దుస్తులు కుట్టించుకోవడానికి వీలుంటుందో? లేదో? అందుకే ముందు గానే సిద్ధంగా ఉన్నట్లుంటుంది" అని ఛలోక్తిగా అనేవారు. నిజానికి ఆ రోజుల్లో సెట్‌లో అనేక మంది ఖాకీ దుస్తులు ధరించేవారు. "దర్శకుడయ్యాక నాలోతల బిరుసుతనం రాకూడదని, అందరిలా నేను కూడా ఓ సాధారణ మనిషినేనే విషయం అందరూ గుర్తించాలనే ఖాకీ దుస్తులు ధరించేవాడ్ని" అని విశ్వనాథ్ పలు సందర్భాల్లో చెప్పారు.
కేరళకు ఏమాత్రం తీసిపోని ప్రకృతి అందాలు గోదావరిసీమ సొంతం. పచ్చని చెట్లు, పాపికొండలు, ఉరుకుతూ ప్రవహిస్తూ, కడలిలో కలయిక కోసం ఉరకలెత్తే పావని గోదారి, తల్లిగోదావరి ఒడ్డున అందమైన పట్టణాలు, సూర్యకిరణాలు సోకి వెండి వేదికలను తలపించే ఇసుకతిన్నెలు, కనుల విందు చేసే గోదావరి పాపికొండల నడుమ సూర్యోదయం, సూర్యాస్తమయం, అణువణువునా హరిత శోభలను అద్దుకున్న భూమాత, ఇంద్రధనస్సుని తలపించే పూలతేరులు, ఎగసిపడే నీలిసంద్రం, సహజసిద్ధమైన అందాల మణిహారం గోదావరి నదీమతల్లి అంటే విశ్వనాథ్‌కు చాలా మక్కువ. ఇటువంటి దృశ్యాలు ఒక సన్నివేశంగానైనా విశ్వనాథ్ తన చిత్రంలో తప్పనిసరిగా చూపించేవారు.
విశ్వనాథ్, జయలక్ష్మి దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. సినిమా రంగంలోని సాధక బాధలు తనకు తెలుసు కాబట్టి వారు ఈ రంగంలోకి రావాలని



ఏనాడూ కోరుకోలేదు. వాళ్లకు కూడా ఇష్టంలేదు. నా పెద్ద కుమారుడు ఎవరి వద్దనో సహాయ దర్శకుడిగా పని చేస్తున్నాడు అని చెప్పుకోవడంకంటే తనో పెద్ద కంపెనీ సౌత్ ఈస్ట్ విభాగానికి జోన్ మేనేజర్ అనీ, చిన్న కుమారుడు సత్యం మహేంద్రలో ప్రాజెక్ట్ ఇంజినీర్ అని చెప్పుకోవడానికి గర్వపడతానని విశ్వనాథ్ చెప్పేవారు.

## పురస్కారాలు

దాదాపు ఐదు దశాబ్దాల పాటు దర్శకుడిగా సత్తా చాటి, తెలుగు సినిమాని కొత్త పుంతలు తొక్కించారు డాక్టర్ కాశీనాథుని విశ్వనాథ్. తొలితరం దర్శకుల ధోరణిలను మార్చి తెలుగు సినిమాని మరో దారి మళ్లించడమే కాకుండా ఇంకో మెట్టు ఎక్కించారు. కళాత్మక దృశ్యాలు, సమాజ అసమానతలు, సమాంతర సినిమా పోకడలు, కమర్షియాలిటీ మేళవించి సినిమాలు చేసి హిట్ కొట్టిన ఏకైక దర్శకుడు కళాతపస్వి విశ్వనాథ్. తన 55 ఏళ్ల దర్శకత్వ ప్రస్థానంలో తెలుగుతెరకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అమితమైన ఆత్మగౌరవం తెచ్చారు. 1965లో దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'ఆత్మగౌరవం'కు కాంస్య నంది పురస్కారాన్ని అందుకున్నారు.
శంకరాభరణం, సప్తపది ఉత్తమ చిత్రాలుగా పురస్కారాలు అందుకున్నాయి. కథా రచయితగా, స్క్రీన్‌ప్లే రచయితగా, నటుడు, దర్శకుడు ఇలా.. పలు విభాగాల్లో నంది పురస్కారాలను అందుకున్నారు. విశ్వనాథ్ పలుమార్లు జాతీయ చలనచిత్ర పురస్కారాలు అందుకున్నారు. 1980లో జాతీయ ఉత్తమ కుటుంబ కథా చిత్రం(శంకరాభరణం), 1982లో నర్గీస్ దత్ జాతీయ సమైక్యతా ఉత్తమ చిత్రం(సప్తపది),1984లో జాతీయ ఉత్తమ చలనచిత్రం(సాగర సంగమం-తెలుగు), 1986లో జాతీయ ఉత్తమ చలన చిత్రం(స్వాతిముత్యం-తెలుగు), 1988లో జాతీయ ఉత్తమ చలనచిత్రం(శృతిలయలు-తెలుగు), 2004లో జాతీయ ఉత్తమ చలనచిత్రం(స్వరాభిషేకం-తెలుగు), 1992లో రఘుపతి వెంకయ్య పురస్కారం, భారత ప్రభుత్వం నుండి 1992లో పద్మశ్రీ పురస్కారం, 2016లో ప్రతిష్ఠాత్మకమైన దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం, 2017లో రోటరీ క్లబ్ వారి జీవిత సాఫల్య పురస్కారం, 2018లో వీబీ ఎంటర్‌టైన్‌మెంట్స్ వారి జీవిత సాఫల్య పురస్కారం, 2022లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంవారి జీవిత సాఫల్య పురస్కారం ఇలా.. అయిదు జాతీయ పురస్కారాలు, పది ఫిలింఫేర్ పురస్కారాలు, సాక్షి జీవిత సాఫల్య పురస్కారాన్ని కళాతపస్వి ఆస్కార్ అవార్డుల నామినేషన్లకు అధికారిక ప్రవేశం పొందింది. విజ్ఞాన్ విశ్వవిద్యాలయంవారు తమ 5వ స్నాతకోత్సవ సందర్భంగా 2017లో విశ్వనాథ్‌కు గౌరవ డాక్టరేట్ అందించారు. ఇన్ని విజయాలు సాధించిన విశ్వనాథ్ భావితరాలకు ఆదర్శం. ❑






# ప్రేమ ఒక లక్ష్యం కావాలి!

డాక్టర్ ఎన్.బి.సుధాకర్ రెడ్డి



**ఫిబ్రవరి** 14 ప్రేమికుల దినోత్సవం. పలు దేశాల్లో వయసులో ఉన్నవారే కాదు, వృద్ధ ప్రేమికులు సైతం ప్రేమపండుగ చేసుకుంటారు. మనసున మనసై, తనువు.. తనువు ఒక్కటై ఒకరిలో ఒకరు సగమై పులకించిపోతారు. మానవ జన్మ పుట్టుకకు మూలమైన ప్రేమ పునాదుల పైన నిర్మించిన పెళ్లి భవనాలకు రంగులు వేసుకుంటారు. అందుకే సర్వమానవాళి ప్రేమ పవిత్రం, ప్రేమ మధురం, ప్రేమ సర్వస్వం ప్రేమే దైవం అంటారు.

కవులు, రచయితలు, భావకులు ప్రేమను పలు విధాలుగా నిర్వచిస్తారు. దాని గొప్పదనం గురించి వివరిస్తారు. తొలి చూపుతో మొదలై చిరునవ్వుతో చేరువై జీవితాంతం సాగిపోయి మరణించినా మరువలేనిది ప్రేమ అంటారు.

ప్రేమ మనసంతా నిండిపోయి మండుటెండలో కూడా పండువెన్నెల కురిపిస్తుందంటారు. అయితే ప్రేమ అంతా ఒక నాటకం, గుట్టు విప్పితే బూటకం అనేవారు ఉన్నారు. ప్రపంచ ప్రసిద్ధ తత్వవేత్త ప్లాటో ఒక దశలో 'ప్రేమ ఒక తీవ్రమైన మానసిక రోగం' అన్నారు. అందుకే తరువాతి కాలంలో ప్రేమల్లో ప్లాటానిక్ ప్రేమ ఒక రకంగా వర్గీకరింపబడింది. సోక్రటీసు ద్వారా ప్రభావితమైన, అరిస్టాటిల్‌తో కలసి ప్రయాణం సాగించిన ప్లాటో మాటల్ని తేలికగా కొట్టిపడెయ్యలేం.

అంతమాత్రాన ప్రేమను దాని పవిత్రతను కాదనలేం. ప్రేమికుల దినోత్సవం పుట్టుపూర్వోత్తరాలను విశ్లేషించి, సమకాలీన పరిస్థితులను పరిశీలిస్తే ప్రేమ ఔన్నత్యం, ప్రేమకు అర్థం తెలుస్తుంది. అలాగే కళ్లెం లేని గుర్రం, తాడు తెగిన గాలిపటంలా దారి తప్పిన ప్రేమను గురించి తెలుసుకోగలం.

క్రీస్తు పూర్వం 270లో రోమ్ దేశంలో నివసించిన వాలెంటైన్ యువతకు ప్రేమపాఠాలు నేర్పేవారు. ప్రేమ సందేశాలు ఇస్తూ ప్రేమపెళ్లిళ్లు చేసేవారు. అదే సమయంలో రోమ్‌ను పాలిస్తున్న చక్రవర్తి క్లాడియస్ కుమార్తె వాలెంటైన్ అభిమానిగా మారింది. దీంతో ప్రేమ సందేశాల నెపంతో ఫిబ్రవరి 14వ తేదీన వాలెంటైన్‌ను ఉరి తీయించారు. రెండు దశాబ్దాల తరువాత అప్పటి పోప్ గెలాసియన్స్ వాలైంటైన్ మరణించిన రోజును 'ప్రేమికుల దినోత్సవం' (వాలెంటైన్ డే)గా ప్రకటించారు. ఇప్పుడు ప్రపంచంలోని పలు దేశాలలో ప్రేమికుల దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేసుకుంటున్నారు. అయితే మన దేశంలో కొన్ని సంస్థలు ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఇది యువతను దారి తప్పిస్తున్న విదేశీ విష సంస్కృతిగా అభివర్ణిస్తున్నాయి. దక్షిణ భారతదేశం కంటే ఉత్తర భారతదేశంలో వ్యతిరేకత ఎక్కువగా ఉంది. మహారాష్ట్రలో శివసేన ప్రేమికుల దినోత్సవం రోజును బ్లాక్ డేగా పాటిస్తోంది. మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో వీరోచిత పాత్ర పోషించిన భగత్‌సింగ్‌కు అదే రోజు మరణశిక్ష విధిస్తున్నట్టు కోర్టు తీర్పు ఇచ్చింది. కాబట్టి ఆ రోజును మరొక పేరుతో దినోత్సవంగా జరపడం తగదని కొందరి వాదన. భజరంగదళ్ కార్యకర్తలు ఆ రోజు రోడ్డుపైన, పార్కుల్లో కనిపించిన ప్రేమికులను పట్టుకుని అక్కడికక్కడే పెళ్లి చేసిన సంఘటనలు ఉన్నాయి. కొన్ని చోట్ల ఈ సంఘటనలు శాంతి భద్రత సమస్యగా మారిన సందర్భాలు ఉన్నాయి. ప్రేమికులకు బలవంతంగా పెళ్లి చేయడం వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు భంగమని కొందరు వాదిస్తున్నారు.

ఇదిలా ఉండగా.. దేశంలో ప్రేమ వైఫల్యాలు, ప్రేమ హత్యలు, ఆత్మ హత్యలు, పరువు హత్యలు పెరిగిపోయి సమాజానికి సవాలుగా మారుతున్నాయి. పవిత్రమైన ప్రేమ కొన్ని సందర్భాలలో సమాజానికి సమస్యగా మారుతున్నది. ఈ నేపథ్యంలో అసలు ప్రేమ అంటే ఏమిటి, ప్రేమ లక్ష్యం ఏది అన్న విషయాల పట్ల అవగాహన పెరగాలి. ప్రేమ పేరుతో కొందరు యువతీ యువకులు దారి తప్పడానికి గల కారణాలను విశ్లేషించక తప్పదు. సైకాలజిస్టులు, సామాజికవేత్తలు, మేధావులు ఈ విషయంలో మంచి మార్గదర్శనం చేయాలి.

## ప్రతి ప్రేమ పవిత్రం కాదు

ప్రేమ పవిత్రం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ప్రతి ఇద్దరి మధ్య కలిగే ప్రేమను పవిత్రమని చెప్పలేం.

పురుషులందు పుణ్యపురుషులు వేరు. తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ల కాదు. తెల్లగా ఉన్నంత మాత్రాన ఉప్పు కర్పూరం ఒకటి కాదు. అలాగే ప్రతి ప్రేమను పవిత్రంగా చూడలేం. జలకాలుష్యం, వాయు కాలుష్యం, భావ కాలుష్యంలాగే కొందరి ప్రేమలు కలుషితమవుతుంటాయి. కోర్కె, స్వార్థం, తపన, శృంగారం, మానసిక దుర్బల్యం లాంటి కొన్ని అంశాలు ప్రేమలో కలసి ప్రేమతత్వాన్ని దెబ్బతీస్తుంటాయి. పాలలో నీళ్ల కలిస్తే పలుచబారుతాయి. కాచి చల్లార్చిన పాలలో పెరుగుతో తోడు పెడితే పాలు పెరుగుగా మారతాయి. అదే పాలలో ఉప్పుగుళిక వేస్తే విరిగిపోతాయి. ప్రేమ కూడా అంతే. ఇష్టం, ప్రీతి, స్నేహం, సాన్నిహితం, త్యాగం, సర్దుబాటు, శృంగారం లాంటి అంశాలు తగిన పాళ్లలో ఉండి కొనసాగితే అది ప్రేమ అవుతుంది. ఇక్కడ మనం చెప్పుకునే ప్రేమ ఒక పురుషుడు, స్త్రీ మధ్య కలిగే ప్రేమ మాత్రమే అన్నది దృష్టిలో పెట్టుకోవాలి. తల్లి ప్రేమ, విశ్వప్రేమ, పితృప్రేమ, సోదర ప్రేమ, ఇతర మానవీయ ప్రేమలను వేరుగా చూడాలి. ప్రేమికుల దినోత్సవం కేవలం ఆడ, మగ మధ్య సాగే ప్రేమకు మాత్రమే పరిమితం అన్నది గుర్తు పెట్టుకోవాలి. కాబట్టి ప్రతిదీ పవిత్రం కాదన్న కోణంలో ఆలోచిస్తే ఆధునిక ప్రేమలను పలు రకాలుగా వర్గీకరించవచ్చు. ఇప్పటి యువతీ యువకుల మధ్య కలిగే ప్రేమల్లో వ్యామోహపూరిత ప్రేమలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా టీనేజ్‌లో ఉన్న యువతీ యువకులు హార్మోన్ల ప్రభావం వల్ల కలిగే వ్యామోహాన్ని ప్రేమగా భ్రమిస్తున్నారు. కొందరికి ఆ విషయం తెలిసినప్పటికీ తమ బలహీనతలకు ప్రేమ ముసుగు వేసుకుంటున్నారు. ఇలాంటివారు ప్రేమ గుడ్డిదని, తొలి చూపులోనే ప్రేమ పుడుతుందని వాదిస్తుంటారు. ఒకవేళ విఫలమైతే ఎదుటివారిని నిందించడం, కర్మసిద్ధాంతాన్ని వల్లించడం చేస్తుంటారు. కొంతమంది మరొకరిని వెదుక్కొంటారు. అది తప్పు కదా అంటే ప్రేమ విశాలం, ప్రేమకు హద్దులు, సరిహద్దులు, ఎల్లలు, తీరాలు ఉండవని వితండవాదం చేస్తుంటారు. ప్లాటోనిక్ ప్రేమలో శృంగార కాంక్ష ఎక్కువగా ఉంటుంది. శృంగారం కోసం ప్రేమిస్తారు. తేడాలు వస్తే విడిపోవడానికి సిద్ధపడతారు. కొందరు అపరిపక్వ ప్రేమకు గురవుతుంటారు. అంటే వారికి జీవితం పట్ల, సమాజం పట్ల సరైన అవగాహన ఉండదు. ఆకలి వేస్తే అన్నం తిన్నట్టే మోహం కలిగితే ప్రేమలో పడుతుంటారు. ఇలాంటి ప్రేమికులు ఎక్కువగా సమస్యలను ఎదుర్కొంటుం టారు. కొంతమంది క్రీడాత్మక ప్రేమికులు ఉంటారు. వారికి ప్రేమ ఒక ఆటలా ఉంటుంది. ఈ బంతి పోతే మరొక బంతితో ఆడుకున్నట్టు ఈ వ్యక్తి కాదంటే మరొక వ్యక్తిని ఆకర్షించి ప్రేమలోకి దింపుతుంటారు. ఇలాంటి వారివల్లనే ఎక్కువగా యాసిడ్ దాడులు, ప్రేమహత్య లు జరుగుతుంటాయి. అవ్యక్త ప్రేమికులు కూడా అక్కడక్కడ తారసపడుతుంటారు. వారికి ఎదుటి వ్యక్తి మీద ప్రేమ కలిగినప్పటికీ వ్యక్తీకరించే ధైర్యం లేక బాధపడుతుంటారు. ఎదుటివారు తమను అర్థం చేసుకోలేదని బాధపడటం చేస్తుంటారు. ఇక సమాజంలో కొందరు శాడిస్టులు ప్రేమికులుగా అవతారం ఎత్తుతుంటారు. తనకు నచ్చిన అమ్మాయిని ఏదో విధంగా లొంగదీసుకుని పలు విధాలుగా వేధిస్తుంటారు. వీరిని



ప్రేమించినందుకు వారు అనేక విధాలుగా నరకయాతన అనుభవిస్తుంటారు. శాడిజం అంటే భాగస్వామిని హింసించి ఆనందించే తత్వం అన్నమాట. అయితే దీనిని రుగ్మతగా భావించకుండా అతిప్రేమగా చిత్రీకరిస్తుంటారు. కొందరు అవసరార్థ ప్రేమికులు అక్కడక్కడా కనిపిస్తుంటారు. డబ్బు, అవసరాలు, విలాసాల కోసం కొందరు అమ్మాయిలు అబ్బాయిలకు ప్రేమ వల విసురుతుంటారు. చెరువు ఎండిపోగానే కొంగలు మరొక చోటికి వెళ్లినట్టు ఈ అబ్బాయి డబ్బు ఖర్చు పెట్టలేనప్పుడు మరొకరితో స్నేహం ప్రారంభిస్తారు. ఇలాంటి పరిస్థితులు ఎదురయినపుడు బలహీన మనస్కులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. ఆవేశం పౌరుషం ఉద్వేగ లోపాలు ఉన్నవారు గొడవలు, హత్యలకు తెగబడుతుంటారు. కొందరిలో శృంగార రుగ్మతలు ప్రేమకు ప్రేరకాలుగా మారుతుంటాయి. మగవారిలో అధిక కామవాంఛలు, ఆడవారిలో నింఫోమ్యానియా తలెత్తినపుడు తోడుకోసం తపించి ప్రేమవలలు విసురుతుంటారు. ఇలా రకరకాలుగా ప్రేమికుల గురించి చెప్పవచ్చు. అందుకే చాలా మంది పెద్దలు, తల్లిదండ్రులు, ప్రేమ వివాహాలను వ్యతిరేకిస్తుంటారు. ప్లాటో కూడా ఇలాంటి ప్రేమలను చూసే 'ప్రేమ ఒక రోగం' అని వుంటారు. అంటే ఆయనకు ప్రేమ పవిత్రత తెలియక కాదు. ప్రజలను ముఖ్యంగా యువతను జాగృతం చేయడా నికి ప్రతికూల వ్యాఖ్యానం చేసి ఉంటారని భావించాలి. అలాగే సమాజంలో జరుగుతున్న అనేక ప్రేమ వ్యవహారాలను చూసిన తల్లిదండ్రులు ప్రేమ వివాహాలను వ్యతిరేకిస్తున్నారు. అయితే దేనినీ గుడ్డిగా సమర్థించడం లేదా వ్యతిరేకించడం మంచిది కాదు. వివిధ అంశాలను విశ్లేషించి మంచి, చెడులను నిర్ణయించాలి.

**వాస్తవిక ప్రేమ విలసిల్లుతుంది..**

ప్రేమలందు వాస్తవిక ప్రేమ వేరు. మన సమాజంలో అధిక శాతం మంది యువతీ యువకులు వాస్తవిక ప్రేమ వైపే మొగ్గు చూపుతున్నారు. అలాగే పెద్దలు కుదిర్చే పెళ్లిళ్లలో కూడా తమకు తగిన వారిని ఎంపిక చేసుకుని జీవితాన్ని ప్రేమమయం చేసుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రేమ, పెళ్లిని ఒక లక్ష్యంగా ఎంచుకుం టున్నారు. చదువు, ఉద్యోగం, జీవితంలాగే ప్రేమైనా, పెళ్లయినా తమ ఆశయాలకు తగినదిగా ఉండాలని భావిస్తున్నారు. ప్రధానంగా ఇప్పటి అమ్మాయిల్లో అన్ని విధాలా తగిన అబ్బాయినే భాగస్వామిగా ఎంచుకుంటు న్నారు. చదువుకుని ఉద్యోగం సంపాదించి తమ కాళ్లపై తాము నిలబడిన తరువాత తగిన వ్యక్తిని చూసి పరిచయం చేసుకుని స్నేహం పెంచుకుని ప్రేమించి పెళ్లి చేసుకుంటున్నారు. అలాంటి ప్రేమల్ని పెద్దలు, తల్లిదండ్రులు కూడా స్వాగతిస్తు న్నారు. సమాజం పట్ల మానసిక స్థితి, ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలి. ప్రేమించే ముందు అన్ని కోణాలలో విశ్లేషించి తగిన వ్యక్తిని ఎంచుకోవాలి. పెళ్లి, పిల్లలతో జీవితాంతం ప్రేమ మాధుర్యాన్ని జుర్రుకోవాలి. అప్పుడు ప్రతి రేయి ఎంత హాయి అన్నట్టు ప్రతిరోజు పరిమళాలు ఆఘ్రాణించవచ్చు. ❑

## పుస్తక సమీక్ష

## జైలు జీవితం-ఓ గొప్ప అనుభవం



ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది సుధాభరద్వాజ్ భీమా కోరేగావ్ కేసుతో ఆగష్టు 28వ తేది 2018న అరెస్టుయి 8 డిసెంబర్ 2021న డిఫాల్ట్ బెయిల్‌పై విడుదల అయిన సంగతి తెలిసిందే. ఈ మూడుసంవత్సరాల జైలు జీవితంపై సుధా యిచ్చిన ఇంటర్వ్యూకి ఎన్.వేణుగోపాల్ ఒనర్చిన తెలుగు అనువాదం 'ప్రేమతో మీ సుధ' దీర్ఘకవితా సంపుటి.

'నేరం ఎవరో మోపుతారు/ నేను నగరం వదలకూడదు/ నిరపరాధినని సాక్ష్యం తేవాలి'అని వాపోతున్న సుధా 'నా వస్తువులను, నన్ను సోదా చేయగలరు/ మరి నా కలలను?' అంటూ ప్రశ్నిస్తున్నారు. 'జైలు ఒక కలలబడి/ ఊహలు చేయటం నేర్పుతుంది/ జైలు ఒక పాఠశాల/ కూడ దీసుకోవడం నేర్పుతుంది/ జైలు ఒక వ్యాయామశాల/ నిలబడడం నేర్పుతుంది'. ఎక్కడ వున్నా..జీవిస్తున్న ప్రతిక్షణాన్ని చైతన్యభరితం చేసుకోవడం అంటే యిదే'. 'తోడుండే కుటుంబాలు లేక, వాదించే వకీళ్లు రాక, చేతిలో చిల్లికాణీ కరవై, కుటుంబబంధం తెగిపోయిందో లేక భర్త తెంపేసుకున్నాడో తెలియక జైలులో మ్రగ్గుతున్న తనలాంటి 'ఆమె'లు ఎందరో. వాళ్లను ఓదారుస్తూ, వాళ్ల కన్నీళ్లను దోసిళ్లతో పట్టిపోస్తూ క్షణం తీరికలేని సుధను 'మూడేళ్ల నిర్బంధంలో నన్ను నన్నుగా నిలబెట్టింది వీళ్లే' అంటున్నప్పుడు మనస్సు ద్రవించకమానదు. విప్లవ రచయితల సంఘం ప్రచురించిన ఈ హృద్యకావ్యం జైళ్లలో మగ్గుతున్న అభాగ్యుల మనఃస్థితిని, దయనీయ పరిస్థితిని కళ్లకు కట్టాంది. **(ప్రేమతో మీ సుధ దీర్ఘకవిత వాసు, వెల: రూ50, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)**

**- రమణ వెలమకన్ని**

## 'అమెరి'కొవిడ్' కథలూ-కాకరకాయలూ'



అమెరికా హాస్యబ్రహ్మగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొంది, ఆటా, నాటా, తానా మొదలైన అమెరికా తెలుగు సంఘాల వ్యవస్థాపకులలో ఒకరు వంగూరిచిట్టెన్‌రాజు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్‌పట్టాపొంది. పారిశ్రామికవేత్తగా గుర్తింపుపొందారు. 200 కథలూ, 25పైగా నాటకాలు రాసారు. 5 ఖండాలలో 7 ప్రపంచ తెలుగుసాహితీ సదస్సులు పెట్టారు. ఇది ఆయన 12వ కథా సంపుటి వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా సంస్థ 108వ ప్రచురణ.్ౖరఈ ఈ సంపుటిలో 16 కథలున్నాయి. కొన్ని కొవిడ్ మహమ్మారినే పద్యంలో రాసిన కథలూ ఉన్నాయి. కొవిడ్ పెళ్లి, ఆర్గానిక్కూ, ఆవుపేడా, మాస్క్‌లూ,రిస్క్‌లూ కుండీలో 'కొట్టిమీరా' బద్ధకావధాని, చలికాలంలో ఉద్యానవనం లాంటి కథలు ఎంతో హాస్యభరితంగా పాఠకుల్ని అలరిస్తాయి. నా బాణీ 'కథావ్యాసం' అని ముందే రచయిత చెప్పారు. వ్యాసకథలుగా ఉంటాయి. 'రిపేరుకొచ్చిన రిఫ్రిజిరేటరూ-విడాకులిచ్చిన సియర్స్ కంపెనీ' కథ రిఫ్రిజిరేటర్ బాగు చేయించి చెక్‌ను ఎవరి పేరున ఇవ్వాలని యజమాని పేరు అడుగుతారు. ఇంటి యజమాని, సియర్స్ కంపెనీ డైవర్టెడ్ డైర్‌రిపేర్స్ డివిజన్ 'మోడీరిపేర్స్..' అనే సమాధానం ఆశ్చర్యపరుస్తుంది. ఇలా అన్ని కథలూ ఆసాంతం హాయిగా..హాస్యభరితంగా సాగుతాయి. వంగూరిగారికి అభినందన. **(అమెరికోవిడ్ కథలూ-కాకరకాయలూ, రచన: వంగూరి చిట్టెన్‌రాజు, వెల: రూ100, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**

## మంచి మనిషి కథల సంపుటి-ఎస్.ఆర్.పృథ్వి



తెలుగునాట అయిదు దశాబ్దాలుగా సాహితీ సేవలు అందిస్తున్న ఎస్.ఆర్.పృథ్వి 25 కథలతో సంపుటి ప్రచురింప చేసారు. వర్తమానంలో తనను కదిలించిన సంఘటనల ఆధారంగా రాసిన ఈ కథలు వాస్తవ అనుభూతిపరంగా పలకరిస్తున్నాయి. కలెక్టర్, మేజిస్ట్రేట్, జడ్జి, ఐ.ఎ.ఎస్., అధికారులు, విశ్రాంతజడ్జి వంటి ప్రభుత్వాధికారులు సహృదయులైన పౌరుల పాత్రల సహకారంతో మంచి మనుషులుగా సమస్యలు పరిష్కరించి వ్యవహరించుట కొన్ని కథలలో కనపడుతుంది. ఈ కథలలో పాత్రలు సామరస్యం, సహనంతో, మానవతా, నైతిక విలువలతో సమస్యలు మంచితనంతో పరిష్కరించుకొనే ధోరణులు కథాపరంగా రచయిత సృష్టించారు. సమాజంపట్ల, ముఖ్యంగా మహిళల పట్ల గౌరవ మర్యాదలతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రచయిత, 'పరస్త్రీవాంఛ', 'గుణపాఠం', 'సెల్‌ఫోన్', వంటి కథలలో సూచించడం, వివాహేతర సంబంధాలు కొన్ని కథలలో కుటుంబంలో సమస్యలు పరిష్కరించడం కనపడుతుంది. ఎంత ఉన్నతులైనా మానవ బలహీనతల కారణంగా తప్పటడుగులు తప్పవని, అవే జీవితాలను మార్చివేస్తాయని రచయిత మంచితనం ద్వారా పరివర్తన సానుకూల దృక్పథంతో తన జీవనానుభవాలను దాదాపు పదికథలు, మలిచి మెప్పించారు. అమ్మకు, నాన్నకు ప్రేమతో అంకితం యిచ్చిన మంచి మనిషి కథా సంపుటి ఆసక్తికరంగా చదివింప చేస్తుంది. **(మంచిమనిషి, రచన: ఎస్.ఆర్.పృథ్వి, వెల: రూ150, ప్రతులకు: పి.ఉషారాణి, 104-6-140, ఎం.జి.వీధి, రామకృష్ణనగర్, రాజమహేంద్రవరం)**

**- ఎర్రమిల్లి**

కవి, కథకుడు, కార్టూనిస్ట్, హాస్యరచయిత అయిన జి.యస్సార్ (గట్టుపల్లి సీతారామారావు) రచనలని సుమారు 40 మ్యాగజైనులు దినపత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు ప్రచురించాయట! 50 పేజీల వీరి కథల్లో క్లుప్తత

## జియస్సారు మంచి పుస్తకం



సమాజం యెడల ప్రేమ, సమాజాన్ని సరిదిద్దాలనే తపన కనిపిస్తాయి. కథల్లోను, కార్టూన్లలోనూ, సున్నితమైన హాస్యం, అంతఃసూత్రమై నిలిచి చదువరికి సంతోషం కలిగిస్తాయి. నాలుగుపాదాల వ్యంజకాల్లో (కవిత్వం) లోకంపోకడ, పరస్పర, విభేదమైన నైజం కనబడుతుంది. ఉగాదిపచ్చడిలో చేదుని ఆస్వాదించమంటూనే ఉగాదిపచ్చడి చేదు అంటు ఇంటావిడకి చీవాట్లు పెట్టాడట (వ్యంజకాలు). 2020కి వీడ్కోలు చెబుతూ రాసిన వచన కవిత్వంలో 'కరుణ' ప్రతిభావంతంగా వివరించారు. వీరు వండివార్చిన కర్టూన్లపై వచ్చిన సంపుటిపై వచ్చిన సమీక్షను కూడా చేర్చటం బహుశారచయిత రాసిన సాహిత్యమంతా ఒక్కచోట చేర్చటం మూఖ్యోద్దేశమై ఉంటుంది. గట్టుపల్లి సీతారామారావు (రచయిత) సమగ్ర సాహిత్యదర్శనం గావించి, వారి వ్యక్తిత్వానికి సాహిత్య సమాలోచనకు అద్దం పడుతుంది ఈ కలగూరగంప సంపుటి.

**(జియస్సార్ రచనలు, కథలు, కవిత్వం కార్టూనులు. రచన: గట్టుపల్లి సీతారామారావు, వెల: రూ 140)**

**- కూర చిదంబరం**





# గాలిలో ఎగిరే చేపలు

- ➤ సముద్ర జలాల్లో అరుదైన ఫ్లయింగ్ ఫిష్‌లు
- ➤ గంటకు యాభై ఆరు కిలోమీటర్ల వేగంతో టేకాఫ్
- ➤ ఇప్పటివరకు ఫ్లయింగ్ ఫిష్ గ్లైడింగ్ రికార్డు 400 మీటర్లు
- ➤ కరేబియన్ దీవుల్లో వాణిజ్య పంటగా కీలకంగా మారిన చేపలు

ఇటీవల మాల్దీవులు, చెన్నై తీరాల్లోనూ సందడి ఈ చేపలు నీటిలో ఈదటమే కాదు గాలిలో ఎగురుతాయి కూడా. అట్లాంటిక్, పసిఫిక్ సముద్ర జలాల్లో కనిపించే ఈ జీవులు ఇటీవల భారత జలాల్లోనూ దర్శనమిస్తున్నాయి. ఈ చేపల కళ్లు నీటి అడుగు ప్రాంతాలను చూడటంతో పాటు గాలిలోనూ స్పష్టంగా చూడగలిగేలా మారిపోతాయట.



**ఈ చేపల విశేషాలు:** ప్రపంచంలో సుమారు నలభై రకాల ఎగిరే చేపలు ఉన్నాయి. ఈ సముద్ర చేపల కుటుంబాన్ని ఎక్సోకోటిడే అని పిలుస్తారు. లాటిన్ భాషలో ఎక్స్ అంటే 'బయట' అని, 'కొయిటోస్' అంటే మంచం అని అంటారు. ఇవి రాత్రిపూట సముద్రపు ఒడ్డుకు వచ్చి నిద్రపోతాయి. కనుక వీటిని లాటిన్‌లో అలా పిలుస్తారు.

### రెండు.. నాలుగు రెక్కలతో..

సాధారణ చేపలు నీటి నుంచి ఎగిరి దూకుతుంటాయి. వాటి దూరం కూడా అడుగు వరకే ఉంటుంది. కానీ ఫ్లయింగ్ ఫిష్ శరీరానికి ఇరువైపులా పొడవాటి, వెడల్పాటి పెక్టోరల్ రెక్కలు ఉంటాయి. ఇందులో 'టూ వింగర్స్' అనే చేపకు రెండు పెద్ద పెక్టోరల్ రెక్కల్ ఉంటాయి. 'ఫోర్ వింగర్స్'గా పిలిచే చేపలకు రెండు పొడవాటి పెక్టోరల్ రెక్కలతో పాటు రెండు పెల్విక్(చిన్న) రెక్కలు ఉంటాయి. వీటి సహాయంతోనే ఇవి గాల్లో సులభంగా ఎగరగలుగుతాయి. వీటి వెన్నుపూస నిర్మాణం చూస్తే పడవ చుక్కానిలా కనిపిస్తుంది. ఇవి పక్షుల స్థాయిలో ఎగరలేవు. కానీ దాదాపు 200 మీటర్ల వరకు ఎగరగలవు. పక్షులు రెక్కలు పైకీ, కిందకి ఆడించినట్లు ఇవి రెక్కలను ఊపలేవు. నీటి నుంచి పైకి వచ్చిన వేగాన్ని బట్టి వాటి రెక్కలను విప్పుకుని మాత్రమే కొంత దూరం ఎగురుతాయి.

### పెద్ద చేపల నుంచి తప్పించుకునేందుకే..

ఈ అసాధారణ చేపలు 6 నుంచి 20 అంగుళాల పొడవు ఉంటాయి. రెండు అంగుళాల పొడవు ఉన్నప్పుడే ఎగరడం ప్రారంభిస్తాయి. డాల్ఫిన్లు, వేగంగా ఈదే ఇతర పెద్ద చేపలకు ఆహారం కాకుండా తప్పించుకోవడానికి ఇవి ఎగిరే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకున్నాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వీటి కళ్లు నీటి అడుగున మాత్రమే కాకుండా గాలిలోనూ స్పష్టంగా చూడగలిగేలా మార్పు చెందాయి. ఇవి చిన్న చిన్న చేపలను, పాచిని తిని జీవిస్తాయి. ఇవి సెకనుకు దాదాపు మీటరు వేగంతో ఉపరితలం వైపు ఈదుతాయి.

### చెన్నయ్ తీరంలోనూ సందడి..

ఇవి ఉష్ణమండల, సమశీతోష్ణ సముద్ర జాతులకు చెందిన చేపలు. అట్లాంటిక్, పసిఫిక్ సముద్ర తీరాల్లో ఎక్కువగా కనిపిస్తాయి.



ఇటీవల వీటి గమనం బంగాళాఖాతంలోనూ కనిపిస్తోంది. భారత్, బంగ్లాదేశ్, జపాన్, వియత్నాం, ఇండోనేషియా, తైవాన్, చైనా, వెనిజులా, బార్బడోస్ జలాల్లో ఎగిరే చేపలు ఉన్నాయి. మాల్దీవులు, చెన్నయ్ తీరాల్లోనూ ఇవి తరచూ కనిపిస్తున్నాయి.



**నాలుగు వందల మీటర్లు ఎగిరి..**

గిన్నిస్ వరల్డ్స్ ప్రకారం ఓ ఫ్లయింగ్ ఫిష్ ముప్పై కిలోమీటర్ల వేగంతో నలభై ఐదు సెకన్ల పాటు గాలిలో ఎగిరింది. ఇది 2008లో జపాన్‌లోని కగోషిమాలో ఫెర్రీలో ప్రయాణిస్తున్న ఓ చిత్ర బృందం కెమెరాకు చిక్కింది. ఇది వెయ్యి అడుగులకు పైన ఎగిరినట్టుగా నమోదైంది. సాధారణంగా ఫ్లయింగ్ ఫిష్‌లు సుమారు ఏడు వందల అడుగుల వరకు, నీటి ఉపరితలం నుంచి ఇరవై ఆరు అడుగుల ఎత్తు వరకు ఎగురుతాయి. నీటిలోకి తిరిగి దూకినప్పుడు కూడా వేగంగా ఈత కొట్టడం ప్రారంభిస్తాయి. ఇవి అలసిపోకుండా వరుసగా పన్నెండు సార్లు ఎగరగలవు.



**పుట్టిన వెంటనే తినేయాలట!**

కరేబియన్ ద్వీప దేశాలైన బార్బడోస్, ట్రినిడాడ్, టొబాగోలకు ఈ చేపలే వాణిజ్యపరంగా కీలకంగా ఉన్నాయి స్థానిక మత్స్యకారులు వాటిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ఫ్లయింగ్ ఫిష్ మాంసం గట్టిగా లేత, తెలుపు రంగులో ఉంటుంది. దీనిని కాల్చి, వేయించి, ఆవిరితో వండుకుని తింటారు. ఎగిరే చేపలను పట్టుకున్న వెంటనే తినేయాలట. వీటిని ఎక్కువ దూరం రవాణా చేయడానికి వీలుకాదు. ఇతర సముద్ర జీవుల మాదిరిగానే ఇవి కూడా కాంతికి ఆకర్షితమవుతాయి. అందుకే మత్స్యకారులు లైట్ల వెలుతురులో రాత్రిపూట వేట కొనసాగిస్తారు. ❑




## రచనలకు ఆహ్వానం


రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా:
**ఎడిటర్, ఆదివారం వార్త,** నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన,
హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

కథ

# మంచి కొడుకు

**యాదగిరి,** సుగుణమ్మల ముద్దుల కొడుకు శేఖరం. తల్లిదండ్రులు చాలా గారాబం చేసేవారు. అతనికి సినిమాలు చూడడం అంటే పిచ్చి. అందరూ సినిమాపిచ్చోడు అని ఎగతాళి చేసేవారు. బడికి వెళ్లకుండా అల్లరి చిల్లరగా తిరుగుతూ ఉండేవాడు. పాఠశాలకు ఎప్పుడో అప్పుడు వచ్చేవాడు. మిగతా విద్యార్థులు కూడా శేఖరంలాగ తయారవుతారని బెంగ మిగతా పిల్లల తల్లిదండ్రుల్లో ఉండేది. ఇది గమనించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒకరోజు శేఖరం తల్లిదండ్రులను పిలిపించి "మీ కొడుకు రోజూ బడికి రావడం లేదని, సినిమాలు చూస్తూ అల్లరి చిల్లరగా తిరుగుతున్నాడని, వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే బడికి వస్తున్నాడనీ, అంతేకాకుండా పిల్లల్ని చెడగొడుతున్నాడని" చెప్పారు. ఇలా చెప్పగానే తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. "క్షమించని కోరుతూ– ఇక ప్రతిరోజూ క్రమం తప్పకుండా శేఖరంను బడికి పంపిస్తామని" మాటిచ్చి" ఇంటికి వచ్చారు. శేఖర్‌ను పిలిచి తల్లిదండ్రులు గట్టిగా మందలించారు. "సోమరితనం వదిలిపెట్టి, సినిమాలు చూడడం మానేసి, బుద్ధిగా చదువుకోవాలని భవిష్యత్తులో గొప్పవాడివి అవుతావని లేకుంటే మాలాగే కూలిపని చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని సుతిమెత్తగా వారించారు. రేపటి నుండి క్రమం తప్పకుండా బడికి వెళ్లకుంటే ఇంట్లో నుండి గెంటివేస్తామని" చెప్పగానే శేఖరంకు భయమేసింది, ఏడుపొచ్చింది.



వెంటనే తల్లిదండ్రుల కాళ్ల మీద పడి తనను క్షమించమని కాళ్లు పట్టుకొని వేడుకున్నాడు. "ఇకనుండి మీరు చెప్పినట్టే వింటాననీ బాగా చదువుతానని మంచి కొడుకుని అనిపించుకుంటా నని" మాటిచ్చాడు. "సరేనని" తమ కొడుకును తల్లిదండ్రులు క్షమించారు. శేఖరం మరుసటి రోజు నుండి తెల్లవారుఝామునే లేచి తన పనులు తాను పూర్తి చేసుకొని, పాఠశాలకు వెళ్లడం, ఏ రోజు పాఠాలు ఆ రోజు చదువుతూ ఉపాధ్యాయుల చేత, తోటి విద్యార్థుల చేత మంచివాడు అనిపించుకున్నాడు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు శాతం మార్కులు తెచ్చుకొని, మొదటి స్థానంలో నిలిచాడు. శేఖరాన్ని అందరు మెచ్చుకున్నారు. తమ కొడుకులో వచ్చిన మార్పులు చూసి తల్లిదండ్రులు సంతోషపడ్డారు.



నీతి: తన తప్పును తాను తెలుసుకోవడమే నిజమైన పశ్చాత్తాపం.

**- యాడవరం సహస్రగౌడ్**

## బాలగేయం

### సూర్యుడై సాగాల..



పెద్దవారి మాటలు
అభివృద్ధికి మూటలు
నత్తలా నడకలు
విజయాలకు
అవరోధాలు.
కాకిలాగ తిరగాలి
కోయిలలా పాడాలి.
సూర్యుడై సాగాలి
పువ్వులై వికసించాలి.
మొక్కలా ఎదగాలి
చెట్టులా కాయాలి.
పండులా పండాలి
అందరికీ స్నేహాన్ని
పంచాలి.
చేతనైనంత సాయం
చేయాలి.
ప్రగతికై ప్రతిఒక్కరూ
కృషిచేయాలి.
విజయాలను అందాలి.

**- పి.వెంకటేశ్వర్లు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

**- ఆశిష్,** కాకినాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. అగ్నిపర్వతాల వల్ల ఎలాంటి లాభ, నష్టాలున్నాయి?

**జవాబు: ఆశిష్!** లాభనష్టాలనేవి ప్రకృతికి సహజ లక్షణం. భూమి ఏర్పడిన తొలి దశలో అగ్నిపర్వతాల వల్లనే భూమి మీద సముద్రాలు, పర్వతాలు, పీఠభూములు, చదునైన ప్రదేశాలు ఏర్పడటం వల్ల అద్భుతమైన నైసర్గిక స్వరూపం రూపుదిద్దు కున్నది. లావా ప్రవహించిన నేల ఏ రైతూ ఊహించలేని విధంగా అత్యంత సారవంతమైనదిగా మారుతుంది. అగ్నిపర్వతాలు మొక్కలకు అవసరమైన కార్బన్ డయాక్సైడ్‌ను అందిస్తాయి. అగ్నిపర్వతాల నుంచి వెలుపలికి దూసుకువచ్చిన శకలాలను భవన నిర్మాణాలలో, రసాయన పరిశ్రమలలోను విరివిగా ఉపయోగిస్తారు. మరో విశేషమేమిటంటే ఉత్తర కాలిఫోర్నియాలో అగ్నిపర్వత ప్రజ్వలనం వల్ల ఉత్పన్నమైన శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చి శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి విద్యుత్‌ను అందిస్తున్నారు.

**- ఎస్.విపిన్,** గద్వాల

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. గాలిలో ఎగిరే పక్షుల మీద గురుత్వాకర్షణ శక్తి పనిచేయదా?

**జవాబు: విపిన్!** గాలిలో ఎగిరే పక్షుల మీద గురుత్వాకర్షణ శక్తి పని చేస్తుంది. పక్షులు తమ రెక్కలను బలంగా ఆడిస్తూ గాలిని కిందికి తోసివేస్తాయి. అదే ముందుకు వెళ్లడానికి శారీరక శక్తి/బలంగా ఉంటుంది. న్యూటన్ మూడవ గమన సూత్రం ప్రకారం, అంతే బలాన్ని గాలి ఈ పక్షుల రెక్కల మీద ఊర్ధ్వ దిశ మీదుగా ప్రయోగిస్తుంది. ఇది పక్షులకు ప్రతిబలంగా ఉపయోగపడుతుంది. ఈ ప్రతిబలం గురుత్వాకర్షణ శక్తి బలాన్ని కూడా అధిగమించడం వలన పక్షులు గాలిలోకి పైకి ఎగరగలుగుతున్నాయి.



# పంచభూత లింగాలు పరమాత్ముని స్వరూపాలు

**దక్షిణ కైలాసం**

హర హర మహాదేవ..శంభోశంకరా అంటూ భక్తిశ్రద్ధలతో కొండకోన, వాగువంక, చిన్నా పెద్ద, ముసలి, ముతక బేధం అనే లేకుండా అందరూ మొకరిల్లే పర్వదినం శివరాత్రి. ఈనెల 18న మహాశి వరాత్రి పర్వదినాన దక్షిణ భారతదేశంలోని పంచభూత లింగాలు వెలసిన ఐదు దివ్యక్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. పంచభూత లింగాల్లో వాయులింగం ఆంధ్ర రాష్ట్రంలో వెలసి ఉండగా, మిగిలిన నాలుగు తమిళనాడులో వెలసి భక్తులకు కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. ఈ దివ్య క్షేత్రాలను దర్శించుకోవడం పూర్వజన్మసుకృతం.

ముల్లోకాల్ని ఏలే దేవతల్లో శివయ్య భోళాశంకరుడు. సనాతుడు. భక్తజన వల్లభుడు, భూతనాథుడు, వైద్యనాథుడు, చరాచర జగత్తును ఆయనే విశ్వనాథుడు, చంద్రశేఖరుడు. భక్తితో కొలిచే తన భక్తులకు సాక్షాత్కరించే శివయ్య దర్శనం సర్వపాపహరణం అంటారు. క్షీరసాగర మథనంలో అమృతం కంటే ముందు హాలాహలం పుట్టిన విషయం అందరికి తెలిసిందే. అది ముల్లోకాలను దహించి వేస్తుందన్న ప్రమాదం ఉండడంతో దేవదానవులందరు భీతావహులై తమను రక్షించాలంటూ పరమేశ్వరున్ని వేడుకోవడంతో లోక రక్షణార్థం ఆ గరళాన్ని తానే మింగి, గొంతులో బంధించి గరళకంఠుడుగా పేరు పొందాడు. ఈ హాలాహల ప్రభావానికి ఆయన కంఠం నీలంగా మారడంతో నీలకంఠుడయ్యాడు. ఆ రోజే 'మహాశివరాత్రి' పర్వదినం, భక్తులకు మోక్షమిచ్చే పర్వదినం.

**మహాశివరాత్రి**

శివ నామస్మరణ చేస్తూ భక్తితో ముక్తి కోసం మొకరిల్లే రోజు మహాశివరాత్రి. సాగర మథనంలో ఆవిర్భవించి సమస్త జగత్తును నాశనం చేసే కాలకూట విషాన్ని గొంతులో దాచి సృష్టిని రక్షించిన భక్తవత్సలుడు సర్వేశ్వరుడు. ఆ సమయంలో సర్వేశ్వరునికి ప్రాణికోటి తనదైన రీతిలో నీరాజనాలు అందించింది. ఆ మహత్తర వేడుకే మహాశివరాత్రి. 'ఓం నమఃశ్శివాయ' అంటూ శివ పంచాక్షరి స్మరణతో మారుమోగే రాత్రి. బ్రహ్మమురారీ మున్నగు దేవతలు అర్చించిన నిర్గుణ నిరాకార లింగమూర్తి శివుడు. నిర్మలంగా శోభస్కరంగా ప్రకాశించే లింగం. దుఃఖాన్ని నాశనం చేసే లింగం. అటువంటి శివలింగానికి నమస్కారం అంటూ ప్రార్థిస్తారు అశేష భక్తకోటి.

## పంచభూత లింగాల్లో శ్రీకాళహస్తి ప్రత్యేకం

పంచభూత లింగాల్లో నాలుగు తమిళనాడులో కేంద్రీకృతం కాగా, ఒకటి నవ్యాంధ్రప్రదేశ్‌లో వెలసింది. భారతదేశంలోని అనేక పుణ్యక్షేత్రాల్లో శ్రీకాళహస్తి మహాక్షేత్రం పరమపవిత్రమైందిగా ప్రసిద్ధి చెందింది. దక్షిణ కైలాసంగా, సత్యవ్రత మహాభాస్కర క్షేత్రంగా, శివానందైక నిలయంగా ఇలా.. అనేక నామాంతరాలతో ప్రసిద్ధి చెందింది. పంచభూత లింగాల్లో మనిషికి ఆయువు అయిన వాయుక్షేత్రంగా విరాజిల్లుతోంది. మిగిలిన నాలుగు లింగాలు జంబుకేశ్వరంలో జలలింగంగాను, తిరువణ్ణామలైలో తేజో లింగంగా, చిదంబరంలో ఆకాశ లింగంగా, కంచిలో పృథ్వీ లింగంగా వెలసినట్లు పురాణాల్లో ఆధారాలు ఉన్నాయి.

శ్రీకాళహస్తి దివ్య క్షేత్రానికి పడమర వైపున ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న స్వర్ణముఖీనది బ్రహ్మదేవుని వరప్రసాదంచే అగస్త్యముని తపఃప్రభావం వల్ల దక్షిణ కైలాసం అనే కొండల్లోంచి పుట్టినట్లు స్థల పురాణం. సర్వేశ్వరుడు సృష్టికర్త బ్రహ్మను పిలిచి కైలాసాన్ని సృష్టించమని ఆదేశించ గా-బ్రహ్మ కైలాసాన్ని సృష్టించే సమయంలో తడబాటులో కొంత భాగం భూమిపై పడినట్లు చెప్తారు. ఆ భాగమే దక్షిణ కైలాసంగా పిలవబడుతున్న శ్రీకాళహస్తి క్షేత్రమని అంటారు. మూడు మూగజీవాల భక్తి, ఆరాధనల ఫలితంగా ఏర్పడినదే శ్రీ(సాలెపురుగు), కాళ(పాము), హస్తి(ఏనుగు).

**పంచభూత క్షేత్రాల విశిష్టత**

మానవుని మనుగడకు పంచభూతాలు ఎంతో అవసరం. వీటి గమనంతోనే మన మనుగడ సాగుతుంటుంది. నింగి, నేల, గాలి, నీరు, నిప్పు పంచభూతాలుగా ఉన్నాయి. ఇందులో శ్రీకాళహస్తిలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుడుగా వెలిశాడు. మానవ మనుగడకు వాయువు ఎంత అవసరమో అందరికి తెలిసిందే. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తికి పంచభూత లింగాల్లో మొదటి స్థానం దక్కిందని చెప్పవచ్చు. ఈ దివ్యక్షేత్రం ముక్తి ప్రధానంగా మూగజీవులకు మోక్షమిచ్చిన ముక్తిధామంగా విరాజిల్లుతోంది. ఇక్కడ వెలసిన స్వామి గర్భాలయంలో ఎడమవైపు రెండు దీపాలు కనిపిస్తాయి.

వీటినే వాయుదీపాలుగా స్వామి ఉచ్వాస, నిశ్వాసాలకు ప్రతీకగా స్థల పురాణం పేర్కొంది. నవగ్రహాలు, ఇరవై ఏడు నక్షత్రాల సౌర మండలం శివయ్య ఆజ్ఞతో నడుస్తుంటాయి. రాహు కేతువులు కూడా ఆయన కనుసన్నల్లోనే ఉంటాయి. ఈ దోషం ఉన్నవారు శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని సందర్శిస్తే గ్రహ దోషం పోతుందని చెప్తారు.

## చిదంబరంలో ఆకాశ లింగం



పంచభూత లింగాల్లో ఒకటైన ఆకాశ లింగం తమిళనాడు లోని కడలూరు జిల్లా కారేకల్‌కు ఉత్తరంగా అరవై కి.మీ దూరంలో చిదంబరం నడిబొడ్డున ఆకాశ లింగం వెలసింది. తమిళ సంఘం సాహిత్య రచనల ప్రకారం సనాతన విశ్వకర్మల వంశస్తుడైన విదువేల్విడుగు పెరుషత్తాన్ ఈ ఆలయ పునః సృష్టికి ప్రధాన రూపకర్తగా చెబుతారు. చోళ, పల్లవ రాజుల కాలంలో ఈ ఆలయం జీర్ణోద్ధరణ జరిగినట్లు ప్రసిద్ధి. హిందూ సాహిత్యం ప్రకారం చిదంబరం అనేది శివుని ఐదు పవిత్రమైన ఆలయాల్లో ఒకటిగా వెలసింది. నలభై ఎకరాల వైశాల్యంలో శైవ, వైష్ణవ సాంప్రదాయాలతో వెలసిన అతికొద్ది దేవాలయాల్లో ఇది ఒకటి. క్రీ.శ 1213లో వనకోవరైయన్ ఈ ఆలయాన్ని పునః నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. శివుడు ఆనందతాండవం భంగిమలో (నటరాజు) వెలసి భక్తులకు వరాలిస్తున్నాడు.

## కంచిలో ఏకాంబరేశ్వరుడు

పంచభూత లింగాల్లో మరొక లింగం పృథ్వీలింగం. ఇది కంచి తమిళనాడులో వెలసింది. ఈ దేవాలయం గోపురం ఎత్తు 59 మీటర్లు భారతదేశంలోని అతి పెద్ద గోపురాల్లో ఇది ఒకటి. ఇక్కడ వెలసిన స్వామి ఏకాంబరేశ్వరుడు. ఈ ఆలయం నిర్మాణం ప్రత్యేక శైలిలో ఉంటుంది.



ఇక్కడ వెలసిన ఏకాంబరేశ్వరునికి నాలుగు వైపులా నాలుగు గాలి గోపురాలు ఉన్నాయి. ఒక్కొక్క గాలిగోపురం ఎత్తు 57 మీటర్లు. దేవాలయం లోపలి మండపంలో వెయ్యి స్తంభాలు, 1008 శివలింగాలు ప్రతిష్ఠింపబడి ఉన్నాయి. ఈ దేవాలయంలో సుమారు 3,500 సంవత్సరాల వయసు కలిగిన మామిడిచెట్టు ఉంది. ఈ చెట్టులోని నాలుగు కొమ్మలు నాలుగు రకాల రుచిగల పళ్లు కాస్తాయి. సంతానం లేనివారు ఈ చెట్టుకింద పడే పండు సేవిస్తే సంతానం కలుగుతుందని నమ్మకం. ఈ చెట్టునీడలో ప్రస్తుత నిర్వాహకులు మరో కొత్త మామిడి వృక్షం నాటారు. పురాతన మామిడి వృక్షం కాండాన్ని అద్దాలపెట్టెలో ఉంచి దేవాలయంలో భద్రపరచారు. ఈ మామిడివృక్షం కింద పార్వతీ పరమేశ్వరులు, పార్వతీదేవి కుమారస్వామిని ఒడిలో కూర్చోబెట్టుకుని వధూవరులుగా దర్శనమిస్తారు.


## జంబుకేశ్వరంలో జలలింగం

జంబుకేశ్వరం తమిళనాడులోని తిరుచ్చికి పదకొండు కి.మీల దూరంలో ఉంది. ఇక్కడ స్వామి ఏనుగులచేత పూజలందుకున్నట్లు స్థల పురాణం. ఈ ప్రాంతంలో పూర్వం జంబువృక్షాలు ఉండడం వల్ల దీనికి జంబుకేశ్వరం అనే పేరు వచ్చింది.



జంబువృక్షాలు అంటే తెల్లనేరేడు అని అర్థం. ఇక్కడి దేవాలయం విశాలమైన ప్రాకారంతో, ఎత్తైన గోపురాలతో వెలసి ఉంది. ఐదు ఎకరాల విస్తీర్ణంతో ఐదు ప్రాకాలు కలిగి ఉంది. ఆలయానికి మొత్తం ఏడు గోపురాలు ఉన్నాయి. జంబుకేశ్వరస్వామి పశ్చిమాభిముఖంగా వెలసి ఉన్నారు. గర్భగుడి పక్కనే అఖిలాండేశ్వరి ఆలయం కూడా వెలసింది. జంబుకేశ్వరుడుగా పేరు పొందిన ఇక్కడి లింగం నీటితో నిర్మితమైంది. కానీ నీటిలో లేదు. లింగం పానవట్టం నుండి నిరంతరం నీరు ఊరుతూ ఉంటుంది. ఈ అంశాన్ని భక్తులకు చూపించేందుకు లింగం పానవట్టంపై ఒక వస్త్రం కప్పుతారు. గర్భగుడిలో గవాక్షానికి నవ ద్వార గవాక్షం అని చెబుతారు. ఈ ఆలయాన్ని కీ.శ 11వ శతాబ్దంలో చోళరాజులు నిర్మించినట్లు, ఆ తర్వాత పల్లవ రాజులు, పాండ్యులు, విజయనగర రాజులు జీర్ణోద్ధరణ చేసినట్లు తెలుస్తోంది. నాయనార్లలో ప్రసిద్ధుడైన సుందర్‌సంబందర్ తదితరులు స్వామిని సేవించి తరించినట్లు చెబుతారు. గతంలో ఈ ఆలయాన్ని కంచికామకోటిపీఠం పర్యవేక్షించేవారు.

## తిరువణ్ణామలైలో అగ్నిలింగం



పంచభూత లింగాల్లో తేజోలింగం తమిళనాడు లోని తిరువణ్ణామలై లో వెలసింది. ఇది జిల్లా ప్రధాన కేంద్రంలోని మున్సిపాలిటీగా ఉంది. అన్నామలై కొండ దిగువన ప్రాంతంలో ఉన్న అన్నామలైయర్ గుడి తిరువన్నా మలైలోనే ఉంది. తిరువణ్ణామలై చెన్నైకి 185 కిలోమీటర్లు, బెంగుళూరుకు 210 కి.మీ దూరంలో ఉంది. తెన్‌పేన్నై నది మీద ఉన్న డ్యాం పర్యాటక ప్రదేశం. ఈ ఆలయం తమిళనాడులోని శైవ క్షేత్రాల్లో ఒక గొప్పక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఈ దివ్య క్షేత్రం యోగులకి, సిద్ధులకి నిలయంగా ఉంది. 20వ శతాబ్దపు గురువులలో ఒకరైన రమణమహర్షి కూడా అరుణాచలేశ్వరం మీద ఉండేవారు. ఈ దివ్యక్షేత్రంలో ఏడాది నాలుగు సార్లు బ్రహ్మోత్సవాలు జరపడం ఆనవాయితీ. తమిళ నెల కార్తికంలో జరిగే బ్రహ్మోత్సవాలు ప్రసిద్ధి చెందాయి. పది రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు కార్తిక దీపంతో ముగుస్తాయి. ఆరోజు సాయంత్రం అన్నామలై కొండమీద సుమారు మూడు టన్నుల నెయ్యితో జ్యోతిని వెలిగిస్తారు. ప్రతి పౌర్ణమినాడు రాత్రి వేలకొలది భక్తులు అరుణాచలకొండ చుట్టు పాదరక్షలు లేకుండా ప్రదక్షిణలు చేసి శివుణ్ణి ఆరాధిస్తారు. ఈ ప్రదక్షిణ పద్నాలుగు కిలోమీటర్లు. చైత్ర పౌర్ణమి రాత్రి ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శిస్తారు.

**- ఎస్.రహంతుల్లా**
ప్రభాతవార్త, శ్రీకాళహస్తి,
**ఫోటోలు-సి.మెహర్‌కుమార్,** రిపోర్టర్.

కథ

# పుల్లేటిపల్లి పులితో..

**యక్కలూరి శ్రీరాములు**

అమ్మ ఏమి చెప్పినా కథగా చెప్పేది.. ఎలా అంటే...

ఇలా! రామసామి గుడి ముందున్న అరుగుల మీద కూచుని ఒక్కొక్కరు ఒక్కో సలహాను గాల్లోకి విసిరేస్తున్నారేగానీ ఏ సలహాను ఎవరూ అంగీకరించే స్థితిలో ఏమాత్రం లేరు. ఆ పల్లె ముప్ఫై నలభై ఇళ్ల కంటే పెద్దదేమీ కాదు, అరవై ఆరేళ్ల క్రితం బస్సు జాడ లేదు సరికదా మనిషి జాడ.. బండి జాడ కూడా అంతంత మాత్రమే.

పురిటి నొప్పులతో విలవిల్లాడుతున్న రమణమ్మని పుల్లేటిపల్లి నుంచి నాగసముద్రం మీదుగా ధర్మవరం రోడ్డు



వరకు ఎలా చేర్చాలన్నదే ఆ పల్లె జనులందరికి ముప్పిరిగొన్న సమస్య. ఎవరి ఆలోచనా సరిపోక ఆచరణకి సరితూగడం లేదు. ఎన్ని ఎత్తులు వేసినా పరిష్కారానికి సరైన పొత్తు కుదరడం లేదు.

చివరికి బాలయ్య ఆలోచనే ఆచరణ దిశగా రూపు దిద్దుకోవడానికి అవకాశమొచ్చింది.

ఎందుకంటే..

దుమ్ము లేపుకుంటూ అప్పుడే అందరి నడుమ ఆ పల్లెలోని రెడ్డి ఇంటికొచ్చిన నల్లని కారు తెల్లని ఆలోచన రేపింది. ఆలస్యం చేయకుండా వెంటనే రెడ్డోరింటికెల్లాడు బాలయ్య, అనుసరించింది తన మేనత్త గురమ్మత్త. గుర్రం వీపు తడుతూ అలికిడికి తలెత్తి చూసి "ఏం బాలయ్యా! ఏమిటి, పనొదిలేసొచ్చినట్టున్నావ్" అడిగాడు నంజిరెడ్డి.

"రెడ్డీ! నా పెళ్లాం పురిటినొప్పులు పడుతోంది, కడుపులో పిండం అడ్డం తిరిగిందని, కాన్పు కావడం చాలా కష్టమని మంతరసాని తులసమ్మక్క చెప్పింది. అందుకని మీ దగ్గరకొస్తి" బాలయ్య.

"అవునా.. అయ్యయ్యో" నంజిరెడ్డి.

"అవునయ్యా.. పెళ్లయిన ఇరవై ఏళ్లకి ల్యాక ల్యాక కడుప్పండింది" గురమ్మత్త.

"అవును రెడ్డీ ఇప్పుడు అసలు విషయం ఏమిటంటే ధర్మవరం ధర్మాసుపత్రికి తీసకపోతేగానీ పురుడు పోసుకునేది కష్టమని చెప్పింది మంతరసాని తులసమ్మక్క" బాలయ్య.

"అవునా! మల్లెట్లా సెయ్యాలప్పా.. ఎద్దులబండయితే శానా లేటైతాదే" దీర్ఘాలోచనలో పడ్డాడు నంజిరెడ్డి.

"అందుకే...

నాకోలోచన తట్టింది రెడ్డి" బాలయ్య.

"అయ్యో.....నీ... తొందరగా సెప్పప్పా" నంజిరెడ్డి.

"ఏమనుకోకపోతే..."

"సూడు బాలయ్యా, నీ మాటతీరు, మంచినతనం నాకు శానా ఇట్టం. నువ్వేంజెప్పినా కాదన్ను. అంతో ఇంతో ఈ ఊళ్లో సదువుకున్నోనివి, అచ్చరంముక్క తెలిసినోనివి నువ్వే. నీ తరహానే వేర్లేప్పా. అది నచ్చే నీతోనే నేనెప్పుడూ మాట్లాడతానని తెల్సు గదా! బిరీన సెప్పప్పా" అన్నాడు నంజిరెడ్డి.

"మీ ఇంటికి కార్లో సుట్టాలొచ్చినారని తెల్సి"

"అవ్.. మా బామ్మర్ది పొద్దుటూరు నుంచి వచ్చినాడులే.. మల్లయితే" అన్నాడు నంజిరెడ్డి.

"ఏం ల్యా.. ఆ కార్లో ధర్మవరానికి నా పెళ్లాన్ని తీస్కబోతే బిడ్డను కంటుంది. తను బతుకుతుంది.

గుండెలోంచి గొంతులోకి పొర్లుకొస్తున్న దగ్ధ ప్రకంపనల స్వరంతో కళ్ల వెనకాలే కన్నీళ్లు నిలుపుకుని... బాలయ్య.

"అద్దిర కద.. బాలయ్యంటే!"

"ఈ ఊళ్లో ఎవురికి రాని ఆలోచన్లు నీకొత్తాయంటే ఏందనుకున్నావ్? ఇదేనప్పా! ఎహె బంగారంగా తీస్కెల్లు. కార్దేముంది భాగ్యం" నవ్వుతూ చెప్పాడు నల్లని నంజిరెడ్డి.

ఆ మాటతో అప్పటిదాకా బాధతో బాలయ్య గురమ్మత్త కళ్లలో దాక్కున్న కన్నీళ్లు ఆనందంతో పెల్లుబికి చెంపల మీదికి చిప్పిల్లాయ్.

"రే.. బామ్మర్దీ..

ఆ కారుడ్రైవర్ని రమ్మను" కేకేశాడు నంజిరెడ్డి.

"ఏం బావా" ఇంట్లోంచి బయటికొస్తూ అన్నాడు బామ్మర్ది.

"ఏం ల్యా.. మన బాలయ్యభార్యకి పురిటినొప్పులొస్తాండాయంట..బిడ్డ కడుపులో అడ్డం తిరిగిందట. అర్జెంట్‌గా ధర్మారానికి దీసుకెల్లాలి. అందుకని కారు గావాల" చెప్పాడు నంజిరెడ్డి.

"అవునా! సరే బావా. గోపాలా.. గోపాలా" డ్రైవర్ గోపాలాన్ని కేకేశాడు

నంజిరెడ్డి బామ్మర్ది. "అయ్యా" అన్నం తిని కడుక్కున్న చేతులు తువ్వాలుతో తుడుచుకుంటూ వచ్చాడు గోపాల్.

గోపాలకి విషయం త్వరగా చెప్పి ధర్మవరం బయలుదేరమన్నాడు నంజిరెడ్డి బామ్మర్ది.

చెప్పిందే తరడవుగా కారుని స్టార్ట్ చేశాడు గోపాల్.

గోపాల్ పక్కసీట్లో బాలయ్య, వెనకాల సీట్లో గురమ్మత్త కూర్చున్నారు. కారు రయ్యిన నంజిరెడ్డి ఇంటినుంచి రామసామి గుడి ముందుకు రాగానే గుడి అరుగుల మీద కూచున్నోళ్లంతా లేచి నిలబడి ముందుసీట్లో కూచున్న బాలయ్యని చూసి ఏమీ అర్థంగాక ఒగరి మొగం ఒగరు చూసుకోసాగారు.

గుడి నుంచి ఇరవై అడుగుల దూరాన్నున్న బాలయ్య గుడిసెముందు కారు ఆగింది.

నలుగురు అమ్మలక్కలు రమణమ్మని చేతుల్లో ఎత్తుకుని బిరబిరా కార్లో ఎనక సీట్లోకి చేర్చడం, రమణమ్మ పక్కన గురమ్మత్త, కారు ముందుసీట్లో బాలయ్య కూర్చోవడం వెంటనే జరిగిపోయింది.

నాలుగడుగులేసిందో లేదో... కారు ఠక్కునాగింది.

కారణం.. మంతరసాని తులసమ్మ కారుకెదురుగా నిలబడింది.

"అన్నా.. బాలయ్యన్నా!

నాగసముద్రందాకా రాళ్లు గుంతలతో ఎగుడు దిగుడుగా దారేం బాగాలేదు. కుదుపులెక్కువైతే కడుపులో బిడ్డకి, రమణమ్మొదినకి ఇద్దరికీ శానా కట్టం. ఎట్లా తీస్కపోతారో.. ఏమో! ఏం సెప్పాలో నాకు పాలుపోవడంల్యా..ఆ ఇసయం సెప్పేదానికొత్తి" దీనంగా మొగం పెట్టి చెప్పింది మంతరసాని తులసమ్మ.

కాన్పు చేసేవారికి మంత్రసాని అని పేరెట్టడం అద్భుతమనిపిస్తుంది. ఆ కాలంలో ప్రతి చిన్న పల్లెలోనూ మంత్రసానులు ఉండేవారు. డాక్టర్లు, నర్సులు లేని ప్రతి పల్లెలో పురిటినొప్పుల నుంచి పుట్టే బిడ్డకి బొడ్డుకోసే వరకు అన్నీ తామై చూసుకునేవారు.

"ఏం చేద్దాం" అన్నట్టు డ్రైవర్ గోపాల్ వైపు చూశాడు బాలయ్య.

ఆలోచన చేస్తున్నాడేగానీ ఏం చెయ్యాలో గోపాల్‌కి అర్థమవడం లేదు.

ఎవరూ ఏమీ మాటాడుకోవడాల్లేవ్..

రెండు నిమిషాలు గడిచినయ్..

అంతలో బాలయ్య మేనమామ లింగమయ్య కారుదగ్గరకొచ్చి "బాలా.. నాకో ఆలోశనొచ్చిందిలేగానీ.. సెప్తా ఇను. నేను మిద్దె కట్టడానికి ఇటికపెల్లలు దెచ్చి రాసిపోసినాను గదా! ఆ ఇటికల్ని దారంటా పరుసుకుంటూ పోతూ ఆ ఇటిక పెల్లల మీద కారుని నడిపించుకుంటూ పోతే సరిపోతుంది గదా! ఏమంటావ్" అంటూ చెబుతూ బాలయ్య, గోపాల్ వంక మార్చి మార్చి చూస్తున్నాడు లింగమయ్య.

పల్లెలోళ్లకి తెలివి తక్కువంటారేగానీ.. ఆ పల్లె నుంచి వచ్చే పాడిపంటలనుంచే పట్నం ఎదిగిందనీ, ఇప్పటికీ ఎదుగుతోందనీ చాలా మంది ఆ ఆలోచనే చేయరు. చరిత్ర మొత్తం పల్లెజీవులు రాసిందేనని గమనించరు. పల్లెల వేర్లు లేకుంటే పట్నం, నగరాలు, మహానగరాలు వృక్షాలయ్యేవా! నేటికీ పల్లెమెతుకు తినిపిస్తేనే కదా పట్నంకి బతుకు.

బాలయ్య రమణమ్మలను కన్నకొడుకు కూతుర్ల కంటే ఎక్కువగా మేనమామ, మేనత్త చిన్నాగమ్మ చూసుకుంటున్నారని చెప్పాలి. కారణం.. కడప జిల్లా తాళ్లపొద్దుటూరు దగ్గరున్న దత్తాపురం నుంచి బాలయ్య, జమ్మలమడుగు నుంచి రమణమ్మ అనంతపురం జిల్లా పుల్లేటిపల్లికి కట్టుబట్టలతో వచ్చిన వీళ్లిద్దర్నీ కడుపులో పెట్టుకుని కాచుకున్నారని, దత్తాపురం, జమ్మల మడుగు ప్రొద్దుటూరులో ఉన్నోళ్లెవరికీ వీరెక్కడున్నారనే విషయాన్ని గుంభనంగా దాచిపెట్టడం వల్లనే వీళ్లిద్దరు ప్రాణాలతో ఉన్నారనే విషయం ఐదారుగురికంటే ఎక్కువ మందికి తెలియదు.

సరే! అదేమిటన్నది కొంచెం ఊహిస్తే ఎవరికైనా ప్రేమనేది అర్థమవుతుందని తెలిసిందే! లింగమయ్య ఆలోచనకి గోపాల్‌కి నోట మాటరాక అవునని తల మాత్రమే ఊపాడు.

ఇంకేముంది..!

క్షణాల్లో పల్లెలోని మగాళ్ల పిలగాళ్ల చేతుల్లో ఇటుకలు చేరుకున్నాయ్.

దారిపొడుగునా పేర్చుకుంటూ పోతున్న ఇటుకల రహదారిపై కారు సునాయాసంగా కుదుపులు లేకుండా మెల్లగా కదలసాగింది.

కారు కదిలిపోతుంటే కారు వెనకాల ఇటుకపెల్లల్ని మళ్లీ ముందుకు తెచ్చి కారుముందు దారిగా పేర్చడం ఎలా వుంటేందంటే ఉత్సవ విగ్రహాల్ని ఊరేగిం చేటప్పుడు తడిపిన చీరల్ని పంచల్ని పరుస్తున్నట్టు తలపించేస్తోంది ఆ దృశ్యం. పల్లెప్రజలు శారీరక, మానసిక శాస్త్రవేత్తలుగాక మరేమిటని తలపుకు తెస్తోంది ఆ సందర్భం.

పులేటిపల్లె నుంచి మొదలైన పురిటినొప్పుల ఊరేగింపు నాగసముద్రం ముందున్న ధర్మవరం తారు రోడ్డుదాకా కారు తేరులా కదిలింది. పండుగ సంబరమై కనిపించింది.

కడుపులో వున్న బిడ్డని, బిడ్డతల్లిని ప్రాణాలతో ఒడ్డుకి చేర్చి గడ్డనేయాలనే "బిగ్రు" పల్లెలోని వాల్లందరి కళ్లలో, మెదిలే చూపుల్లో, కదిలే కాళ్లల్లో ఇటుకలు పేరుస్తున్న చేతుల్లో అగుపించింది.

నాగసముద్రం ముందున్న ధర్మవరం రోడ్డుకి నల్లేరు మీద నడకలా కొలను నీటిలో తెప్పోత్సవంలా కుదుపులు లేకుండా కారును చేర్చారు.


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com

కారు ధర్మవరం వైపు వేగంగా పరుగులు తీసింది.
కారు వెనక పల్లెప్రజల పెదాలపై నవ్వులు ఆ మండుటెండలోనూ మల్లెపువ్వులై విరగ్గాసినయ్.
పల్లె ప్రజలంతా పుల్లేటిపల్లికి వెనుదిరుగుతున్న దృశ్యం తృప్తితో నిండిన వేయి పండుగల సాయంకాలాల్ని గుర్తుకు తెస్తున్నయ్.

...


కారు ధర్మవరం చేరింది.
ఆసుపత్రి కాంపౌండ్‌లో ఆగింది.
బాలయ్య పరుగెత్తుకెళ్లి నర్సమ్మని పిలుచుకొచ్చాడు.
కారు దగ్గరకొచ్చి రమణమ్మ స్థితిని గమనించి డాక్టర్‌ని పిలుచుకొచ్చింది నరసమ్మ.
రమణమ్మ పరిస్థితికి ఏం చేయాలో నరసమ్మకి డాక్టర్ చెప్పగానే స్ట్రెచర్ మీద రమణమ్మని ఆపరేషన్ గదికి ఆఘమేఘాల మీద చేర్చడం జరిగిపోయింది.
పురిటినొప్పుల్తో తల్లడిల్లిపోతున్న రమణమ్మ ఆపరేషన్ గదిలోని బెంచీ మీదున్న కత్తుల్ని, కత్తెరల్ని చూసి భయంతో వణికిపోయింది.
"ఏంగాదులేమ్మా.. రవ్వంతసేపులో అయిపోతుంది, నేనున్నాను కదా!" అంటూ రమణమ్మ కడుపు మీద చేయి వేసి అటు ఇటు మెల్లిగా తడిమి తల నిమిరి మత్తింజక్షన్ ఇచ్చింది నరసమ్మ.
డాక్టర్ వస్తున్న అలికిడి, బిడ్డ అడ్డం తిరిగిందన్న నరసమ్మ మాటలు మత్తులో కెళుతున్న రమణమ్మకి లీలగా వినిపిస్తూ గాలిలో తేలిపోతున్నాయ్.
ఆపరేషన్ చేసి, ఆపరేషన్ గదిలోంచి ఆసుపత్రి కాన్పుల గదిలోకి రమణమ్మని శిశువుతో సహా చేర్చడానికి చాలా సమయం పట్టింది.
బాలయ్య ముఖంలో సంతోషం గురమ్మత్త లోని ఆనందం శిశువుచుట్టూ తాండవం చేసింది. ఓ గంట గడిచింది రమణమ్మ కనురెప్పలు మెల్లిగా తెరుచుకున్నాయ్..
క్యార్ క్యార్‌మంటున్న శిశువు వైపు చూపులు తొంగిచూశాయ్.
పక్కనే వున్న ఇనుప ఉయ్యాలలో ఒళ్లంతా బ్లేడుతో జివిరినట్టు కత్తులతో చెక్కినట్టు రక్తమోడుతూ నెత్తుటిముద్దగా ఎర్రగా వున్న బిడ్డ క్యార్... క్యార్ మంటూ రక్తపుగాట్లతో విలవిలలాడుతూ విలపిస్తున్న ఓ జీవి..
ఆనందంతో కళ్లలో విచ్చిన మధురమైన దృశ్యం ఓ వైపు.. బిడ్డ నెత్తురోడున్న మరోవైపు.. కమ్ముకొచ్చిన దుఃఖంతో పెదాలు వణుకుతూ రెప్పకి రెప్పకి నడుమ చీకటి వెలుగుల చర్యతో మూతబడుతున్న రమణమ్మ కళ్లు...
శిశువుకు కావలసిన సబ్బు, నూనె తీసుకురావడానికి ఆసుపత్రి బయటికి బాలయ్య వెళ్లాడు.
కాన్పుల వార్డులో నర్సమ్మ గురమ్మత్త ఒకరిద్దరు మినహా ఎవరూ లేరు.
ఇంతలో హఠాత్తుగా..
పుట్టగోసి మినహా వంటిపై ఏ అచ్ఛాదనా లేని వ్యక్తి పిచ్చోడో...వెర్రోడో..తిక్కోడో.. బిగ్గరగా అరుచుకుంటూ పరిగెత్తుకుంటూ రావడంతో ఆసుపత్రి ఆవరణలోని వాళ్లంతా ఒక్కో దిక్కుకు పరుగులెత్తారు.
ఆ వచ్చిన వ్యక్తి రావడం రావడం కాన్పుల వార్డులోకి దూరడంతో అంతవరకూ అక్కడే వున్న నరసమ్మ "డాక్టర్.. డాక్టర్..తిక్కనారాయణస్వామి వచ్చినాడు" అని అరుచుకుంటూ డాక్టర్‌తో చెప్పడానికి వెళ్లడంతో గదిలో వున్న గురమ్మత్తకి ఏం చేయాలో బోధపడలేదు. గదిలో వున్న మరొకామె ఓ మంచం కిందకి దూరి బిక్కు బిక్కుమంటూ చూస్తూ వణికిపోసాగింది.
ఈ గందరగోళం మాటలకి నిస్సత్తువతో వున్న రమణమ్మ కనురెప్పల్ని పూర్తిగా తెరవలేక చూపుల్ని బయటికి పంపలేక కళ్లని బరువుగా మోస్తోంది.
తిక్కనారాయణస్వామి వచ్చినోడు వచ్చినట్టు బిగ్గరగా అరుచుకుంటూ..
గంతులేసుకుంటూ రావడం రావడంతోనే ఊయల్లో వున్న రమణమ్మ బిడ్డ నెత్తురుముద్దగా వున్న పసికందును చేతుల్లోకెత్తుకుని గాల్లోకి ఎగురవేస్తూ నవ్వుతుంటే పారిపోయి దూరంగా నిలుచున్న వాళ్లంతా భయంతో నోటమాట రాక ఏం చేయాలో తోచక వణికిపోతూ చూస్తూ నిలుచున్నారు.
"అయ్యో! పసికందును కింద పడేస్తాడేమో" అంటూ అరిచింది గురమ్మత్త.
"బిడ్డను నేలకేసి మోదుతాడేమో ఆ పిచ్చోడు" దూరం నుంచి ఓ గొంతు.
ఇవేవీ పట్టించుకోక గాల్లోకి బిడ్డని విసిరేస్తూ.. అరుస్తూ.. విశాలమైన తన కళ్లతో తదేకంగా బిడ్డని చూస్తూ తెల్లని పళ్లతో మెరుపులా నవ్వుతూ కత్తుల గాయాలతో ఒళ్లంతా నెత్తురోడుతున్న పసికందును అటూ ఇటూ తిప్పుతూ చుట్టూ వున్న అందరినీ చూస్తూ గంభీరంగా మారిపోయాడు తిక్కనారాయణస్వామి.
గుర్.. గుర్‌మనే శబ్దం గొంతులోంచి వస్తుండగా ఒక్కసారిగా మరీ బిగ్గరగా అరిచాడు.
నోరు తెరిచాడు.. బిడ్డను పళ్లతో కొరుకు తాడేమోనని అందరిలోనూ సందేహం..
అంతే! పసికందుపై నున్న రక్తాన్నంతా చీకుతూ జుర్రుకోసాగాడు. తన నోటి లాలాజలం గంగాజలమై పసిగుడ్డు పైనున్న నెత్తుటినంతా నాలుకతోనే కడిగేసాడు.

గదిలో వున్న మరొకామె ఓ మంచం కిందకి దూరి బిక్కు బిక్కుమంటూ చూస్తూ వణికి పోసాగింది.

పావుగంట గడిచింది. పసిబిడ్డ బంగారగడ్డలా మిలమిలా మెరుస్తున్నాడు తిక్కనారాయణస్వామి నల్లని చేతుల్లో.
అరంగట వరకూ తను ఆ బిడ్డతో తన నవ్వులతో తానే ఆడుకుంటూ పూలదండలా బిడ్డను ఎత్తి పట్టుకుని ఊయల్లో మెల్లిగా పడుకోబెట్టి బిడ్డ తల నిమిరి నవ్వుకుంటూ గది బయటికి వచ్చి ఆకాశం వైపు చూసుకుంటూ పెద్ద పెద్ద అంగలు వేసు కుంటూ చినుకులు రాలుతుండగా ఆసుపత్రి బయటికి వెళ్లిపోయాడు.
ఆసుపత్రి అంతా ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుంది.
డాక్టర్ నర్సమ్మ వచ్చి బిడ్డను చూశాడు.
"మేం చేయాల్సిన పని తను పూర్తి చేసి వెళ్లాడు" అంటూ డాక్టర్ వెళ్లిపోయాడు.
"తలతోగాక కాళ్లతో బయటికొచ్చే బిడ్డను ఎంత జాగ్రత్తగా తీసి గాట్లు పడక తప్పలేదు, ఎంతగా తుడిచినా నెత్తురు రావడం మానలేదు. కష్టకాన్పు కదమ్మా" అంటూ గురమ్మత్తతో చెబుతూ తను తెచ్చిన దూదితో బిడ్డ ఒళ్లంతా మళ్లీ తుడవసాగింది నర్సమ్మ.
అప్పుడప్పుడే కళ్లు పూర్తిగా తెరుస్తున్న రమణమ్మని చూసి అప్పుడే వచ్చిన బాలయ్య ముఖంలో ఆనందం తొంగిచూసింది.
అంతవరకూ అక్కడ జరిగిన విషయాన్ని గురమ్మత్త చెబుతున్నప్పుడు బాలయ్య కళ్లు పెద్దవి చేసి వింటూ సంతోషం తొణికిస లాడే చూపుల్తో బిడ్డను చూస్తుంటే "పుల్లేటి పల్లి పులిగా వీడు" అంటోంది ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడని గురమ్మత్త. ఇంతకూ ఆ రమణమ్మ ఎవరో కాదు.. మా అమ్మ.
ఆ బాలయ్య మరెవరో కాదు.. మా నాన్న.
ఆ పసిగుడ్డు ఇంకెవరో కాదు..నేనే! ❑

మాతృభూమి దాస్య విముక్తికి ఉరికంబాలు, తుపాకి కాల్పులు ఆహ్వానించిన అమర యోధుల కథనాలు, హృదయాలను ఎప్పటికీ కదిలిస్తూనే వుంటాయి. స్వాతంత్ర్యానంతరం కూడా భారతజాతి హృదయంలో ఎన్నో వీర సైనికుల అమర త్యాగాలు నిక్షిప్తమై వున్నాయి. దశాబ్దాల కాల పరిభ్రమణంలో, దేశభక్తి, త్యాగనిరతితో దేశ స్వతంత్ర్య, సమగ్రత, పరిరక్షణ కోసం రణరంగంలో ప్రాణాలను పణంగా పెట్టే వీరసైనికులకు పాటతో భారత జాతిని భావోద్వేగంతో సమ్మోహితం చేసారు. నాటి దేశాధ్యక్షుడు సర్వేపల్లి రాధాకృష్ణన్, భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సమక్షంలో, యావద్భారతం ఈ పాటతో తన్మయించింది. జవహర్‌లాల్ నెహ్రూ కన్నీళ్లతో చలించిన ఘటన అది.

కవి ప్రదీప్ సాహితీపరంగా, సుమధుర గాయని లతా మంగేష్కర్ శ్రావ్య స్వర పరంగా రెండింటి మేళవింపు, అమరవీర యోధులకు భారతజాతి శాశ్వత నివాళి



# అమర సైనిక నివాళిగా 'లతాజీ స్మృతి' గానం

జోహార్లు ఘటించడం, కృతజ్ఞతా పూర్వకంగా శిరస్సులు వంచి ప్రణతులు సమర్పించడం పౌర మానవతా ధర్మం.

1962 ఇండియా-చైనా సంగ్రామం తరువాత స్వతంత్ర భారత జీవన చరిత్రలో బరువెక్కిన హృదయ స్మృతిగా, ఒక అమరగానాన్ని, గానకోకిల 'లతా మంగేష్కర్' జాతికి అందించారు.

"అయ్ మేరే వతన్ కే లోగో" దేశభక్తి ప్రపూరిత అద్భుత రచన, ప్రఖ్యాత కవి ప్రదీప్(రామచంద్ర నారాయణ్‌జీ ద్వివేది) కలం నుండి వెలువడింది. "నా దేశ ప్రజలారా! కన్నీటి హృదయ వేదనతో అమరుల త్యాగాలను గుర్తు చేసుకోండి. వారిని మరువొద్దు. అందుకే ఈ కథ వినండి" అంటారు. ఆరు దశాబ్దాలుగా, ఆరున్నర నిమిషాల పాటలో, షహీద్ అమర సైనికుల వీర మరణాలను గుర్తుచేస్తూ 'లతాజీ' భారత జాతికి విషాద స్మృతి, కృతజ్ఞతాభరిత జోహార్లు ఘటింపచేస్తున్నారు. ఈ పాట ఆలపించిన, భారతరత్న, సుమధుర గాయని లతాజీ, ఆ వీర యోధుల ఆత్మార్పణలకు తన స్వరం ద్వారా అమరత్వం ఆపాదింపచేసారు. జనగణమన, వందేమాతరం వంటి జాతీయ గేయాల కోవలో, లతాజీ పాట, భారత జాతి సజీవంగా వున్నంత కాలం తన్మయింపచేస్తూనే ఉంటుంది.

భారత-చైనా 1962 యుద్ధం పూర్తి అయిన పరిణామాల చారిత్రక నేపథ్యంలో ఈ పాట ముడిపడి వుంది. రెండు నెలల అనంతరం 1963 జనవరి 26 గణతంత్ర దినోత్సవ సందర్భంలో భారత రాజధాని ఢిల్లీలోని నేషనల్ స్టేడియంలో లతాజీ, ఈ



సమర్పించే కానుక భారత జాతికి లభించింది. ఈ హిందీ గీతానికి ప్రముఖ సినీ నేపథ్య సంగీత దర్శకుడు సి.రామచంద్ర సంగీతం సమకూర్చారు. లతాజీ ఈవేళ మన మధ్య లేకపోయినా, అమర సైనిక నివాళిగా నిరంతరం ఆ గీతం ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.

1929 సెప్టెంబరు 28న జన్మించిన లతా మంగేష్కర్ 1945 నుంచి 2000కు పైగా భారతీయ చిత్రాలలో కొన్ని వేలకు పైగా పాటలు ఆలపించిన 'వాయిస్ ఆఫ్ ది మిలీనియంగా' 92వ ఏట ఫిబ్రవరి 6, 2022న కన్నుమూసారు. 2001లో భారత ప్రభుత్వం అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'తో సత్కరించింది. జీవిత కాలంలో 1999 నవంబరు నుండి 2005 వరకు ఇండిపెండెంట్ సభ్యురాలిగా రాజ్యసభలో ఎమ్.పి.స్థానాన్ని అలంకరించారు. భారత ప్రధాని నరేంద్ర మోడీకి తన ఆశీస్సులు అందచేసిన సన్నిహిత స్నేహశీలిగా వుండేవారు. అమర గాయని స్మృతి చిహ్నంగా ఏర్పాటు అయిన 'లతా దీనానాథ్ మంగేష్కర్' అవార్డు భారత ప్రధాని నరేంద్ర మోడీ 2022 ఏప్రిల్ 24న స్వీకరించారు. సినీ సంగీతమే కాకుండా మీరా, గాలిబ్, సంకీర్తనలు, భజన్‌లు, గజల్స్, శాస్త్రీయ, జానపద, సంప్రదాయ, భక్తి సంగీత కీర్తనలు ఆలపించిన కళాకారిణిగా అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు, ఆల్బమ్‌లు ఆవిష్కరింపచేసారు. సంగీత కచేరీలతో దేశ విదేశాలలో కోట్లాది సంగీత అభిమానులను పరవశం చేసారు. 2012లో గాంధీజీ తరువాత మహోన్నత భారతీయులు ఆన్‌లైన్ సర్వే పోలింగ్‌లో 10 మంది మహోన్నతులలో గ్రేటెస్ట్ ఇండియన్‌గా భారత ప్రజ గుర్తించింది. 1989లో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, జీవిత కాలంలో ఎన్నో ప్రతిష్ఠాత్మక పౌర సన్మానాలు, ఫిలిమ్‌ఫేర్ అవార్డులు, జీవిత సాఫల్య పురస్కారాలు పొందారు.

సంగీత కచేరీలు నిర్వహించి మానవతావాదిగా జనసామాన్యానికి చేయూత అందించారు. 2001లో పూణేలో మాస్టర్ దీనానాథ్ మంగేష్కర్ ఆసుపత్రి ప్రారంభించారు. సంపూర్ణమైన జీవన సాఫల్యంతో, నిష్కామ అత్యున్నత వ్యక్తిత్వంతో, శతాబ్దపు సంగీత సామ్రాజ్ఞిగా, 'వాయిస్ ఆఫ్ ది నేషన్'గా భారతజాతి ఐక్యత, ఏకత్వ జాతీయత, సమున్నత దేశభక్తి విలువల ప్రతీకగా, భారత జనావళి హృదయాలలో చిరస్థానం పొందిన లతా మంగేష్కర్ జాతి సజీవంగా వున్నంత కాలం స్మరణీయులే.

**- జయసూర్య**

# మూగవోయిన మధురగానం

కోయిల లాంటి మధుర స్వరం, తేనెకంటే తీయనైన సుమధుర గాత్రం, ఏ భాషలో పాడినా అందరినీ ఆకట్టుకునే వినసొంపైన గానం, ఎన్నిసార్లు విన్నా తనివి తీరని వినసొంపైన కంఠం.. ఇవన్నీ మధుర గాయని వాణీజయరాం కు సొంతం. నాలుగు దశాబ్దాలుగా భారతీయ సంగీత ప్రపంచంలో తన కంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించు కున్న సంగీత సరస్వతి వాణీ జయరాం అసలు పేరు కలైవాణి. ఆమె తమిళనా డులోని వెల్లూరులో దురైస్వామి, పద్మావతి దంపతుల ఎనిమిది సంతానం లో ఐదవ పుత్రికగా 1945 నవంబరు 30న జన్మించింది. వారి తల్లి పద్మావతి వీణా విద్వాంసులు రంగరామానుజ అయ్యంగార్ శిష్యురాలు. వాణీ జయరాం అయిదవ ఏట నుండే సంగీత శిక్షణ పొందారు, పసిప్రాయంలోనే బాల మేధావిగా విశేష ప్రతిభ కనబర్చింది. ఎనిమిదవ ఏటనే ఆమె ఆల్ ఇండియా రేడియో కార్యక్రమంలో పాల్గొన్నారు. సంగీతం పైన ఉన్న మక్కువతో కర్ణాటక సంగీతంను కడలూరు శ్రీనివాస అయ్యంగార్, టీఆర్, బాలసుబ్రమణి యన్, ఆర్ఎస్ మణి వద్ద అభ్యసిం చారు. చదువు పూర్తయిన తర్వాత స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేశారు. 1969లో జయరామ్‌ను వివాహం చేసుకున్నారు. తన పేరుతో భర్త పేరును కలుపుకుని వాణీ జయరామ్‌గా ప్రజల్లో ప్రసిద్ధి చెందారు. ఆమె మామగారు కూడా గాయకుడు కావడంతో ఆయన ప్రోత్సాహంతో గాయనిగా అడుగులు వేశారు. వివాహా నంతరం భర్త జయరాంకు ముంబై బదిలీ కావడంతో అక్కడే ఒక అపార్ట్ మెంట్‌లో అద్దెకు ఉంటూ స్థిరపడ్డారు.

వాణి భర్త కూడా సంగీతకారుడు, వాద్యకారుడు కూడా. ఇద్దరూ సంగీత ప్రపంచంలోనే ఎన్నో ఏళ్ల కలిసి జీవించారు. ముంబైలో ఉస్తాద్ అబ్దుల్ రహమాన్ వద్ద హిందుస్థానీ సంగీతం నేర్చుకున్నారు. సంగీతంపై మక్కువతో బ్యాంకు ఉద్యోగాన్ని సైతం వదిలేశారు. ముంబైలో ఉండగా భర్త ప్రోత్సాహంతో కొన్ని కచేరీలు చేశారు. ఆ కారణంగా బాలీవుడ్‌లో అవకాశాలు వెతుక్కుంటూ వచ్చాయి. 1971లో ఆమె సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. 'గుడ్డి' సినిమాలో 'బోలె రే పపీ హారా' అనే గీతం ద్వారా సినీ నేపథ్య గాయకురాలి గా హిందీ చిత్రసీమలో ప్రవేశించారు. ఆ తరువాత వాణీ జయరాం వెనుతిరిగి చూసుకోలేదు. తెలుగు, తమిళం, కన్నడ, మళయాళం, హిందీ, ఉర్దూ, బెంగాలీ, భోజ్‌పురి, ఒరియా, తుళు మొదలైన భాషల్లో గాయనిగా పేరు తెచ్చుకున్నారు. తమిళురాలైన వాణీ జయరామ్ భర్తతో కలిసి తన మకాంను చెన్నైకి మార్చుకుని గాయనిగా అయిదు దశాబ్దాల ప్రస్థానంలో పంధొమ్మిది భాషల్లో కొన్ని వేల పాటలు



పాడారు. ఎమ్మెస్ విశ్వనాథన్, కేవీ మహదేవన్, ఇళయరాజా, ఆర్.డి.బర్మన్, ఓపీ నయ్యర్, మోహన్ తదితర దిగ్గజ సంగీత దర్శకుల స్వరాలకు వాణీ జయరామ్ గాత్రంతో ప్రాణం పోశారు. శాస్త్రీయ సంగీతం మాట వచ్చేసరికి తెలుగు ప్రజలకు టక్కున గుర్తుకు వచ్చే పేర్లు సుశీల, జానకి. వీరిద్దరూ మంచి గాయనీమణులు. వీరిద్దరూ తెలుగువారు కావడం వల్ల ఒకింత అభిమానం ఉండటం సహజం. కానీ వీరి సరసన చేరడానికి అన్ని రకాల అర్హతలు ఉన్నప్పటికీ వాణీ జయరామ్ ఆ స్థాయిలో అర్హతను సంపాదించుకోకవడం విచారకరమనే చెప్పవచ్చు. 'స్వాతికిరణం' సినిమాలో పదకొండు పాటలు పాడారు. అలాగే విశ్వనాథ్ తీసిన శంకరాభరణం, స్వాతిముత్యం, స్వాతికిరణం, సిరివెన్నె ల, సీతాకోకచిలుక, స్వర్ణకమలం, శృతిలయలు, ప్రేమాలయం, సీతామా లక్ష్మి సినిమాల్లో ఆమె పాడిన పాటలు అద్భుతం. ఇంకా అనేక చిత్రాలు ఆమె గళం వల్లనే విజయం సాధించాయంటే అతిశయోక్తి కాదు. ఆమె వినయం, నిరాడంబరత, ఎటువంటి హడావిడి లేని గాత్ర ప్రదర్శన విశ్వ సంగీత ప్రియుల హృదయాలను దోచుకున్నాయి. నేటి తరం సంగీత సాధకులకు ఆమె ఆదర్శమని చెప్పవచ్చు. ఆమెకు సంతా నం కలగలేదు. ఐదు సంవత్సరాల క్రితం భర్త చనిపోయారు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగానే ఉన్నారు.

వాణీజయరాం మంచి చిత్రకారిణి. ఆమె వేసిన పెయింటింగ్స్ ఎంతో ఆదరణ పొందాయి. నైతిక విలువలు, క్రమశిక్షణ తో కూడిన జీవితం గడిపారు. భక్తిపాటలు పాడడానికి ఎల్లప్పుడూ ముందుండేవారు. అవే తనకు ప్రశాంతతను ఇస్తాయని చివరి వరకు నమ్మారు.

వాణీ జయరాం సంగీత ప్రపంచానికి చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభు త్వం ఇటీవల పద్మభూషణ్ పురస్కారం ప్రకటించింది. దాన్ని అందుకోకుండానే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఉత్తమ గాయనిగా మూడు సార్లు జాతీయ పురస్కారం అందుకున్నారు. కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అపూర్వ రాగంగళ్' సినిమా (తెలుగులో 'అంతులేని కథ') పాటలకు జాతీయ పురస్కారం అందుకు న్నారు. మిగతా రెండు సార్లు కె.విశ్వనాథ్ సినిమాలో పాడిన పాటలకు అందుకున్నా రు. 'శంకరాభరణం'లో పాటలకు 1980 లో; ఆ తర్వాత 'స్వాతికిరణం' సినిమాలో 'ఆనతినీయరా హరా' పాటకు 1991లో మరోసారి వాణీ జయరాం జాతీయ పుర స్కారం అందుకున్నారు. ఆమె వయసు 78 ఏళ్లు. చెన్నైలోని ఆమె నివాసంలో 2023 ఫిబ్రవరి 4వ తేదీన మరణించారు. వాణీ జయరాం వివాదాలకు దూరంగా ఉండటంతో పాటు ఇతరులకు తన వంతు సహాయం చేసే విషయంలో ముందు వరుసలో ఉండేవారు.

**- షేక్ వాసీన**

# వెరైటీ వంటలు



## సెల్‌రోటీ

ఇది ఒక తీపి వంటకం. అంతేకాదు, నేపాలీల జాతీయ వంటకం. సెల్‌రోటీ అంటే టెన్నిస్ ఆడే రింగ్‌లా ఉంటుంది. దీనిని బియ్యప్పిండితో చేస్తారు. మొదట్లో దీపావళి పండగనాడు నేపాలీలు వండుకొనేవారట. ఇప్పుడు అన్ని శుభకార్యాల్లో ఈ వంటకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. తెలుగునాట పెళ్లికూతురికి సారె ఇచ్చినట్టుగా.. అక్కడ పెళ్లయిన అమ్మాయి పుట్టింటి నుంచి మెట్టినింటికి వస్తూ వెదురుబుట్ట నిండా ఈ తీపిరొట్టెలని సారెగా తెస్తుంది. నేపాల్‌లో పర్వత సానువుల్లో పండే సెల్‌రకం బియ్యంతో చేస్తారు కనుక దీనికి సెల్‌రోటీ అనే పేరు వచ్చింది. అనుభవజ్ఞులు వీటిని చేతులతోనే చేస్తారు. కొత్తగా చేసేవారు వీటికి సంబంధించిన ప్రత్యేకమైన పరికరాలతో ఈ రింగులని తయారు చేస్తారు. నేపాల్ ప్రభావం ఉండే సిక్కిమ్, డార్జిలింగ్ లోనూ దీనిని ప్రధాన పిండి వంటకంగా చేసుకుంటారు. దమ్ ఆలూ, ఆలూఆచార్, వెల్లుల్లి పచ్చడి కాంబినేషన్‌తో కలిపి తింటారు. కొబ్బరి, దాల్చిన చెక్క, పంచదార, బెల్లం... ఇలా వాడే పదార్థాల్ని బట్టి వందకు పైగా సెల్ రోటీలని తయారు చేస్తారు. మొదట్లో నేపాల్, సిక్కింలకే పరిమితమైన ఈ వంటకం ఇప్పుడు అందరికీ తెలిసింది.



## సింగాడాలు

నీటిలో దొరికే దుంపలివి. తాజాగా ఉన్నప్పుడు ఇవి పచ్చగా, ఎర్రగా ఉంటాయి. వీటిని పచ్చివి/ఉడికించినవి తింటారు. మార్కెట్లో చూసినపుడు నల్లగా కనిపిస్తాయి. పైకి దుంప నల్లగా ఉన్నా కోసి చూస్తే లోపల తెల్లగా ఉంటుంది. వీటి



ఆకారం కారణంగా ఈ దుంపలను బ్యాట్ నట్, బుల్‌నట్ అని అంటారు. ఉత్తరాదిలో ఈ దుంపల్ని మర పట్టించి ఆ పిండితో వివిధ రకాల వంటకాలు తయారు చేస్తుంటారు. ఈ దుంపలను తినడం వల్ల



సంతాన సామర్థ్యం పెరుగుతుంది. ముఖ్యంగా హార్మోన్ల అసమతుల్యత నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అధిక రక్తపోటుతో బాధపడేవాళ్లు ఈ దుంపల్ని ఆహారంలో చేర్చుకుంటే మేలు జరుగుతుంది. క్యాలరీలు తక్కువగా, పీచు ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునేవారికి ఈ దుంపలు మంచి ఆహారం. యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలు అధికంగా ఉండే ఆహారం కనుక వీటితో చేసిన రొట్టెలని ఉపవాసాల సమయంలో తింటుంటారు కొంత మంది. ❑





# పల్లె నీ కన్నతల్లే!

ఈ వారం కవిత్వం

పల్లె సంస్కృతి సంప్రదాయాల/ ముల్లె
పండుగలప్పుడు గుర్తుకొచ్చే పల్లె
పల్లె ఒడిలో సేద తీరే పట్నాలు
పల్లెకు ఎప్పుడు పిల్లలే!। మరువకు... / పల్లె నీ కన్నతల్లే!
పండుగలకు పల్లెలకు బోతే
పుట్టింటికి పోయినట్లే ఉంటుంది
పెద్దవారు కూడా తల్లిరెక్కల కిందికి
చేరిన పిల్లలైపోతారు.
పట్నం అంతా బోసిపోతుంది
పల్లె లేకుండా పట్నం ఎక్కడిది?
పల్లె పట్నంలో పూవై వికసించింది!
పట్నం ఎదుగుతుంటే పల్లె తల్లి
తన బిడ్డే అని మురుస్తుంది
తిరిగి వస్తుంటే/ కొంగుబంగారం ఇచ్చి పంపుతుంది.
తన జవసత్వాల సంగతి/ మరుస్తుంది.
పట్నం మెట్టినిల్లు.. పల్లె పుట్టిల్లు!
దేశ ప్రగతి రథచక్రానికి పల్లెలు
ఇరుసులు!/ కందెన అందక ఇరుసులు అరిగి
తరుగుచున్నవి/ పట్నంవాసులు 'వామనులు' ఐతే
పల్లె 'బలి' చక్రవర్తియే/ పట్నం కలిమికి బలిమికి
పల్లె తల్లిది ఎప్పుడు ఇచ్చే పై చేయి!

**- పి.బక్కారెడ్డి**

# ప్రేమంటే..



అనుబంధం పూసిన పుష్పయాగం
అనురాగం ఎగిసిన సుగంధ
పరిమళం
సర్వమానవాళి శ్రేయస్సు కోరే
శోభాయమానం
ఆ పేరు వింటేనే మధురం
ఆ పలుకు మధురాతి మధురం
ఒక పులకింత.. ఓ కలవరింత
కులం, మతం అనే సరిహద్దులు
లేని గమ్యం
ఓటమి ఎరుగని మలయ
మారుతం
ఏదో ఒక క్షణాన ప్రతి జీవిలోనూ
చిగురించే
ఓ దివ్యమైన అనుభూతి
గుండెల్లో నాదమై..
కళ్లల్లో వెలుగుదీపమై..
అణువణువునా ప్రాణమై..
నిరంతరం ప్రకాశిస్తూ ఉంటుంది.

**- కాయల నాగేంద్ర**

# బతుకంతా..

ప్రియతమా!
నిను చూసిన తొలి క్షణమే
వలచిన నా మనసు
భ్రమరమల్లే నీ వెంటే తిరుగుతోంది.
అనుక్షణం నీ తలపుల వీచికలు
పిల్లతెమ్మెరలై స్పృశిస్తోంటే,
నీ స్మృతులు జగాన్నే మైమరపిస్తోంటే,
నా మనసు అద్దంలో/ నీదైన ప్రతిబింబం
నను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.
నీ ఆరాధనే ఊపిరిగా బతికేస్తూ
నీ నీడలా వెంటాడుతోన్న నా కళ్లల్లో
నీకై నేను లిఖించిన/ ప్రేమలేఖలను
చదివి/ నేనే నీవైన వైనాన్ని
గుర్తించలేదా?/ పదే పదే పిల్లగాలులతో
పంపిన / వలపు రాయబారాలు,
నా హృదయ సవ్వడుల గమకాలు
నిను చేరడం లేదా?/ ఏ రాయబారం
కావాలి?/ నా సందేశాన్ని
నీకందించాలంటే
ఏ ఆకాశ
గమనం
చేయాలి?
నీ హృదికి నేను
దగ్గరవ్వాలంటే/ ఏ దారిలో రావాలి?
నీ దరికి నా మనసు చేర్చడానికి.
అలుపెరుగని రీతిలో/ నీ కోసమే
ఎదురుచూసే/ ప్రాణం ఇదేనని,
నాదేనని/ అది నీకోసమే ఉందని
నీకు తెలిసే రోజు ఎప్పటికో?
ప్రియా!/ ఒక్క మాట నిజం.
నీవు లేని బతుకు
ఆమని లేని కోయిలరాగం,
కాలం క్షణమొక యుగమై
కదలని విరహ కాలం.
నేను నువ్వయ్యే రోజుకై
నిద్రాహారాలు లేక నిరీక్షిస్తూ
నీకై అనుక్షణం తపిస్తోన్న
నా హృదయ విపంచిని
నీ ప్రేమతో రవళింపచేసి
నా గుండెలో లయవై,
రెప్పమాటున కనుపాపవై దాగిపోవా!
నా ఊపిరిలో ఊపిరిగా మమేకమై
బతుకంతా తోడుండిపోవా!

**- వేమూరి శ్రీనివాస్**



# మనస్ఫూర్తిగా నవ్వాలి..

ఒ మనిషి మనసు అది ఉన్నచోట ఉంటేనే సరిగ్గా ఆలోచించడం జరుగుతుంది. పని చేయడం జరుగుతుంది. అలాగే నోరారా నవ్వితేనే జబ్బు మటుమాయమవుతుందంటారు. ఇది ఎంతో అంత నిజం.

ఒకరి మానసిక స్థితికి, సంతోషానికి దగ్గర సంబంధముంది. ప్రతిరోజూ స్వేచ్ఛగా నవ్వుతూ ఉండాలి. ఇలా నవ్వడం గుండెకు మేలు చేస్తుంది. ఎందుకంటే నవ్వు, వ్యాయామం వంటిది.

రక్తనాళాలు మరింత సమర్థవంతంగా పని చేయడానికి సహాయపడుతుందని వైద్య పరిశోధకులు తెలిపారు. ఒత్తిడి వల్ల గుండె ఆగిపోయే ప్రమాదం ఉంది.

మానసిక శక్తి లేకపోవడం శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని మరో పరిశోధనలో తేలింది.

అమెరికాలోని ఫ్లోరిడాలో ఒకానొకప్పుడు జరిగిన కార్డియాలజీ లేబొరేటరీ వార్షిక సమావేశంలో పరిశోధకులు ఈ అధ్యయయాన్ని ప్రకటించారు.

ఓ ఇరవై మంది వాలంటీర్లకు రెండు రకాల చిత్రాలను చూపించారు. ఒక వర్గానికి నవ్వు తెప్పించే సినిమా, మరో వర్గానికి నిస్పృహ కలిగించే సినిమా చూపించారు. చిత్రం చూసిన తర్వాత– వారు తమ రక్తనాళాల చలనశీలతను కొలిచారు. సగటున, విస్తృతంగా నవ్వేవారిలో రక్త ప్రసరణ 22 శాతం పెరిగింది. నవ్వకుండా మనసు నియంత్రణలో ఉన్న వ్యక్తి శరీరంలో రక్త ప్రవాహం సగటున 35 శాతం తగ్గింది.

మనిషికి వ్యాయామం ఎంత మేలు చేస్తుందో నవ్వు కూడా అంతే మేలు చేస్తుంది. ఏ సమయంలోనైనా శారీరక శిక్షణలో నిమగ్నమైతే ఎలాంటి మానసిక స్థితి అయినా మెరుగు పడుతుందని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ సౌత్ వెస్టర్న్ మెడికల్ సెంటర్‌లో పని చేస్తున్న డాక్టర్ త్రివేది తెలిపారు. తన అభిప్రాయాన్ని నిర్ధారించేందుకు 20 నుంచి 45 ఏళ్ల లోపు మానసిక పైత్యంతో బాధపడుతున్న ఇరవై మందిని ఎంపిక చేసి బృందంగా పరీక్షించారు. నవ్వనివారి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో కనుగొన్నారు. సరైన ఆహారం శరీరానికి ఎలా మేలు చేస్తుందో అలాగే నవ్వు కూడా మనిషి ఆరోగ్యానికి మేలు చేస్తుందని తమ అధ్యయనంలో కనుగొన్నారు.

...

ఆ మధ్య నా మిత్రుడొకడు నవ్వుతూ రావడం చూశాను.

"ఏమిటి? నవ్వుతున్నావు?" అని అడిగాను.

"నవ్వడానికి ఒక అవకాశం వచ్చిందండీ! నవ్వుతున్నాను, అది తప్పా?" అన్నాడు.

"తప్పు కాదు.. నవ్వడం మంచిదే. ప్రభుత్వమే చెబుతోందిగా నవ్వమని" అన్నాను.

"ఏంటీ? నవ్వమని మన ప్రభుత్వం చెబుతోందా?" అని అడిగాడు.





"అబ్బే మన ప్రభుత్వం కాదు.. ఒకానొకప్పుడు జర్మనీ ప్రభుత్వం అక్కడ ఉన్న ప్రజలను నవ్వమని చెప్పింది"

"ఎందుకలా?" అని అడిగాడు మిత్రుడు.

"ఈ ప్రపంచంలో చాలా తక్కువగా నవ్వేవారు జర్మన్లట. అది వారి స్వభావమట. ఎప్పుడూ ముఖాన్ని సీరియస్‌గా పెట్టుకుంటారట వాళ్లు" అన్నాను.

"అలాగా!" అన్నాడు.

"అవును.. ఈ స్వభావాన్ని మార్చుకోవాలన్నదే జర్మనీ ప్రభుత్వం ఆశ. ఇందుకోసం అక్కడ పలు చోట్ల లాఫింగ్ సొసైటీలు ఆరంభించారు. నవ్వుల సంబరాలు కూడా నిర్వహించడం మొదలుపెట్టారు. కామెడీ సినిమాలే ఎక్కువగా తీస్తున్నారు, విడుదల చేస్తున్నారు. ప్రజలను నవ్వమని చెప్పడానికి అనువైన సినిమాలను తీయమని జర్మనీ ప్రభుత్వం ప్రోత్సహించిందన్నాను".

"ఈ లెక్కన నేను నవ్వుకుంటూ రావడం తప్పేమీ కాదుగా!" అన్నాడు మిత్రుడు.

"అది తప్పు కాదని నేను మొదటే చెప్పానుగా" అన్నాను.

"అలా చెప్పు, ఇప్పుడు నా మనసుకి తృప్తిగా ఉందన్నాడు" మిత్రుడు.

"అది సరే, నీ నవ్వుకి కారణమేమిటో తెలుసుకోవచ్చా?" అన్నాను.

"బాధ కలిగినప్పుడు, కష్టం వచ్చినప్పుడు, ఒత్తిడి అధిగమించడానికి నవ్వడం మంచిదన్నాను".

"ఇంతకూ నీ నవ్వుకి కారణమేమిటని?" అడిగాను.

"అదా! అరటిపండు తొక్క మీద కాలు చేసి జారి పడటంతో ఆ మనిషి వెన్నెముకకు తీవ్రగాయమైంది" అన్నాడు.

"ఎవరికి గాయమైంది? నీకా?" అడిగాను.

"అబ్బే..! ఎవరికో కాదు, నా భార్యకే. నేనెట్టాగూ ఏమీ చేయలేను. ఇలాగైనా దాని తిక్క కుదిరిందిగా. అందుకే ఈ నవ్వులన్నీనూ" అన్నాడు మిత్రుడు.

**- యామిజాల జగదీశ్**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



వృత్తి వ్యాపారస్తులకు పోటీ పెరుగుతుంది. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యవసాయ భూమి కొనుగోలు చేస్తారు. ఊహించని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. ధర్మ రక్షణకై పాటుపడతారు. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి.



## వృషభం

ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎదురు చూస్తున్న శుభ సమాచారం వారాంతంలో తెలుస్తుంది. చిరు వ్యాపారులకు పోటీ ఎదురైనా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి.శుభ కార్యాల్లో పాల్గొంటారు.

## మిథునం



సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. ఉద్యోగులకు పనివత్తిడి అధికం. కుటుంబంలో మనస్పర్థలకు అవకాశం. హోల్ సేల్ వ్యాపారులకు బాగుంటుంది. విదేశీ ప్రయాణ సూచనలున్నాయి. కళాకారులకు ప్రముఖుల ప్రశంసలు లభిస్తాయి. శత్రువులు మిత్రులవుతారు. తాహతుకు మించిన రుణాలు చేస్తారు.



## కర్కాటం

సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగ ప్రయత్నం ఫలించే అవకాశాలు అధికం. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. అనుకోని అతిథుల రాక ఆనందం కలిగిస్తుంది. కింది స్థాయి ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు సహనం అవసరం.

## సింహం



వాక్చాతుర్యంతో అన్ని పనులు చక్కబెట్టుకుంటారు. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. విశేష వస్తువులు సమకూర్చుకుంటాయి. క్రయ-విక్రయాలు లాభిస్తాయి. నూతన పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. సాహితీ మిత్రులను కలుస్తుంటారు. చోర భయం పొంచి వుంది కనుక విలువైన వస్తువులు జాగ్రత్త.



## కన్య

విందు-వినోదాల్లో పాల్గొంటారు. తీర్థ యాత్రలు చేస్తారు. శత్రువులు మిత్రులవుతారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు. చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు లభిస్తాయి. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. వాహన యోగం.

## తుల



ఆరోగ్య సమస్యలుంటాయి. అనూహ్యంగా మొండి బకాయిలు వసూలు. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. స్త్రీలకు శుభ యోగం. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించండి. అకారణంగా మానసిక సంఘర్షణకు లోనవుతారు. ప్రభుత్వ సంబంధమైన పనులు పూర్తి చేస్తారు. వృథా ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు. నూతన గృహ యోగం.



## వృశ్చికం

సొంతింటి స్వప్నం సాకారమవుతుంది. ఉద్యోగంలో పనివత్తిడి పెరుగుతుంది. వృద్ధుల ఆరోగ్యం మెరుగు పడుతుంది. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. క్రీడాకారులు, కళాకారులకు సన్మాన యోగం. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. శత్రువులు మిత్రులవుతారు.

## ధనుస్సు



విద్యార్థులకు శుభ యోగం. కుటుంబంలో సమస్యలు తీరి ప్రశాంతత ఏర్పడుతుంది. దేశాంతర ప్రయాణం చేస్తారు. అనాథాశ్రమాలకు మీ శక్తి మేరకు సహాయం చేస్తారు. శత్రువులు మిత్రులవుతారు. ఆరోగ్య, ఆహార సలహాలు, సూచనలు పాటించండి. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న సమాచారం వారాంతంలో అందుకుంటారు.



## మకరం

గృహ రుణాలు తీరుస్తారు. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. వ్యాపారులకు పోటీ ఉంటుంది. క్రీడాకారులు, కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలనం. ధార్మిక చింతన అలవడుతుంది. ప్రభుత్వ సంబంధమైన పనులు వాయిదా పడతాయి. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి.

## కుంభం



ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ఆలోచనలు స్థిరంగా ఉంటాయి. వృథా సంచారం చేస్తారు. ఉద్యోగులకు అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయి. ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించండి. విలాసవంతమైన జీవితం పట్ల ఆకర్షితులవుతారు.



## మీనం

నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. వృథా ఖర్చులుంటాయి. ఆరోగ్యం కుదుట పడుతుంది. స్త్రీలకు స్థిరాస్తి లభిస్తుంది. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. శత్రువులు మిత్రులవుతారు. విదేశాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం తెలుసుకుంటారు. సామాన్య ధన లాభం. ఏది జరిగినా మన మంచికే అన్న ధోరణి అలవడుతుంది. ప్రభుత్వ సంబంధమైన పనులు వాయిదా పడతాయి. గృహ యోగం.

# కథా కమామిషూ



బెర్తలేమి తిమోనియా టైలరింగ్


➤ సినిమా కథ లాంటి జీవిత కథ ఇది... ప్రముఖ చిత్రకారుడు నౌషాద్ పెళ్లిచూపులు. మనలో చాలా మంది పెళ్లి సమయాల్లో వున్న విషయాన్ని అతి చేసి చెప్తుంటారు. సినీరంగంలో నౌషాద్‌కు మంచి పేరు ఉంది కానీ పెళ్లి చూపుల సమయంలో దర్జీ అని చెప్పుకున్నారు. ఇది నమ్మగలమా? ఔను.. ఇది జరిగింది. 1950 వరకు సినిమా రంగం అంటే చాలా చిన్నచూపు. పిల్లనిచ్చేవారు కారు. అందువల్ల నౌషాద్ దర్జీవాడినని చెప్పుకుని పెళ్లి చేసుకున్నారు. ఆ పెళ్లిలో బ్యాండ్‌వాళ్లు వాయించిన పాటలు చాలావరకు నౌషాద్ స్వరపరిచినవే రతన్ సినిమా పాటలు.

### టైలరింగ్ మెషిన్

టైలరింగ్ మెషిన్‌ను కనిపెట్టడానికి మంచి ప్రయత్నం జరిగింది. 1830లో ఫ్రెంచ్ దేశస్థుడైన బెర్తలేమి తిమోనియా టైలరింగ్ మెషిన్ తయారు చేసాడు. కానీ చేనేతవాళ్లు ఈ మెషిన్ వల్ల తమ రాబడి జీవితం పోతుందని కోపంతో ఇతడి ఫ్యాక్టరీని తగలబెట్టేసారు. ప్రాణభయంతో తిమోనియా దేశం వదిలి వెళ్లిపోయాడు. అంతకుముందు 1804లో ఫ్రెంచివాళ్లు థామస్ స్టోన్, జేమ్స్ హ్యాండెర్సన్, 1810లో జర్మన్ దేశస్థుడు బ్లజార్ క్రెమ్స్, 1814లో ఆస్ట్రియా దేశస్థుడు జోసెఫ్ మాడెస్పెర్గ్, 1818లో అమెరికా దేశస్థుడు జోన్ ఆడమ్స్ డాగ్, జోన్ నోల్స్ కూడా కుట్టు యంత్రాన్ని రూపకల్పన చేశారుగానీ అవి ఉపయోగించే విధానానికి దగ్గరవలేదు. పేటెంట్ హక్కులు పొందారు. ఆ తరువాత అమెరికాకు చెందిన ఇలియాస్ హోవిన్ పెటెంట్ తీసుకున్నాడు. కానీ చేనేతవారి కోపానికి దేశం విడిచి వెళ్లాడు. 1851లో అమెరికాకు తిరిగి వచ్చాడు. తాను రూపకల్పన చేసిన కుట్టుమిషన్ ఐజాక్ మెరిట్ సింగర్ అనే వ్యక్తి అందించిన కుట్టుమెషిన్ సింగర్ పేరుతో విశేష ప్రాచుర్యం పొందింది. సొమ్ము ఒకరిది సోకు ఒకరిదని అంటే ఇదే కాబోలు.

### జెసిబి సృష్టికర్త జోసెఫ్

జెసిబి అనే పేరు ఇప్పుడు బాగా వింటున్నాం, చూస్తున్నాం కూడా. పెద్ద పెద్ద నిర్మాణాల సమయాల్లో వాడుతున్నాం. పెద్ద పెద్ద గోతులు తీయడానికి, కాల్వలు తవ్వడానికి గుట్టలు తొలగించడానికి వాడుతాం. బ్రిటిష్ మెకానికల్ ఇంజినీర్ అయిన జోసెఫ్ సిరిల్ బాంఫోర్డ్ తన పేరులోని మొదటి మూడు అక్షరాలు చేర్చి జెసిబి అని పేరు పెట్టి 1953లో ఈ భారీ యంత్రాన్ని తయారు చేసాడు. జెసి బాంఫోర్డ్ ఎక్స్కెవటర్స్ లిమిటెడ్ అనే పేరుతో కర్మాగారం నిర్మించారు. 2001లో తన 84వ యేట చనిపోయారు.




జోసెఫ్ సిరిల్ బాంఫోం

### మాగ్నటో మీటర్ సృష్టికర్త కార్ల్‌ఫ్రెడ్రిక్

రాజకీయ నాయకులకు, వివిపిలకు వారి వారి స్థాయిలను బట్టి రక రకాల రక్షణ వ్యవస్థ ఉంది. వారి వారి హోదాలను బట్టి రక్షణ కల్పిస్తుంది. మన దేశ ప్రధాని మొదలుకుని ఎటువంటి రక్షణ కల్పించాలని వివరంగా తెలియచెప్పే పుస్తకం పేరు 'బ్లూ బుక్'. ఇందులో ప్రధానమంత్రి యాత్ర, వసతి, పాల్గొనే కార్యక్రమాలకు అనుగుణంగా ఎటువంటి భద్రత కల్పించాలో పొందుపరిచి ఉంది. మిగతా వారికి కల్పించాల్సిన భద్రతా వివరాలు ఎల్లో బుక్‌లో పొందుపరిచారు. ప్రముఖులు ఎదుర్కొంటున్న అపాయాలు వంటి వాటిని బట్టి రక్షణ వ్యవస్థని నాలుగు రకాలుగా వివరించారు. అవి ఎక్స్, వై, జెడ్, జెడ్ ప్లస్. ఇందులో ప్రధానమైనది జెడ్ ప్లస్ కేటగిరీ. అతి ప్రముఖమైన వ్యక్తి లేదా ఎదుర్కోబోయే ప్రమాద తీవ్రతని బట్టి సమకూరుస్తారు.

➤ ఈ రోజుల్లో మెటల్ డిటెక్టర్ పేరు విననివారు ఉండరు. అలాగే పెద్ద షాపింగ్ సెంటర్‌లో వీటిని పెట్టడం సాధారణం అయిపోయింది. మన రక్షణ వ్యవస్థ దెబ్బ తీసే వస్తువులు ఉంటే కనిపెడుతుంది. దీనికి మరో పేరు మాగ్నటో మీటర్. దీనిని 1833లో కార్ల్ ఫ్రెడ్రిక్ గాజ్ అనే శాస్త్రవేత్త కనిపెట్టారు. కొంత దూరం నుండే లోహ వస్తువులను కనిపెట్టి సూచన చేస్తుంది. మరో రకం.. కాంతి వలయం దిశ కనిపెట్టేది వెక్టార్ రకం మాగ్నటో మీటర్, కాంతి వలయం శక్తితీవ్రత కనిపెట్టేది స్కాలర్ రకం మాగ్నటో మీటర్. ఇవి ఎక్కువగా గనులలో, భూమి తవ్వకాల్లో వాడతారు.



కార్ల్‌ఫ్రెడ్రిక్

➤ సినిమాల్లో, పోలీస్, సైనికులు ధరించే బుల్లెట్ ప్రూఫ్ వస్త్రాలు చూస్తుంటాం. స్టీలు కన్నా అయిదు రెట్లు బలంగా ఉండే కేవ్లార్ నైలాన్ దారంతో తయారు చేస్తారు వీటిని. వీటి బరువు చాలా తక్కువ. మనం సాధారణంగా వేసుకుంటున్న షర్ట్‌లా వేసుకోవచ్చు. కేవలం బుల్లెట్ ప్రూఫ్ వస్త్రం అని కాదు, దీనితో అంతరిక్ష యాత్ర చేసే వాహనాలలో, పారాచూట్‌లో నీటి అడుగున వేసే కేబుల్‌లో వాడతారు. వీటికి తుప్పు పట్టదు.

**- ఈ.ఎస్. మాధవన్**

సింగిల్ పేజీ కథ

# కల సాకారం

**సి.హెచ్.నాగార్జున శర్మ**

అదొక సాధారణ మధ్య తరగతి కుటుంబం.

జ్యోతి, మహేష్‌లు భార్యాభర్తలు. వారికి ముగ్గురు సంతానం. వారి పేర్లు దేవి, సందీప్, కవిత.

మహేశ్ వ్యాపారం చేసేవాడు. చాలా పట్టుదల మనిషి. ఏ పనైనా మొదలు పెడితే ఆ పనయ్యేదాకా నిద్రపోడు. భార్య జ్యోతి గృహిణి. ముగ్గురు పిల్లల్నీ తండ్రి పాఠశాలలో చేర్పించారు. వాళ్లు బాగా చదువుకుంటున్నారు.

ఒకరోజు కవిత చదివే స్కూల్లో వాళ్ల క్లాస్ టీచర్ పిల్లలందర్నీ "పెద్దయ్యాక మీరేమవుతారో చెప్పండి?" అని ఒక్కొక్కరినీ అడగడం మొదలెట్టింది.

"దినేష్! నువ్వేమి కావాలనుకుంటున్నావు?'

"సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్" అని గర్వంగా చెప్పాడు.

"చంద్రా! నువ్వేమి కావాలనుకుంటున్నావు?"

"లెక్చరర్"

"కళ్యాణీ! నువ్వేమి కావాలనుకుంటున్నావు?"

"స్కూల్ టీచర్"

"కవితా! నువ్వేమి కావాలనుకుంటున్నావు?"

"ఏరోస్పేస్ ఇంజనీర్" అని ధీమాగా చెప్పింది.

"ఓ! గ్రేట్! అంతరిక్షంలోకి వెడతావా? లేక ఏరోప్లేన్ నడిపే పైలట్ అవుతావా?" అని అడిగింది టీచర్.

ఆ ప్రశ్నకు కవిత "మొదట ఏరోప్లేన్ నడిపే పైలట్ అవుతాను. ఆ తర్వాత అంతరిక్ష నౌకలో ప్రయాణించి అంతరిక్షంలోకి వెడతాను" అని అంది పట్టుదలగా.

"నీకింత పట్టుదల ఎలా అబ్బింది? దీనికి కారణం ఎవరు?" అడిగింది టీచర్.

"నాలో ఇంత పట్టుదల కలగడానికి మా నాన్నే కారణం. ఆయన ఏ పనైనా మొదలు పెడితే ఆ పని పూర్తయ్యేదాకా నిద్రపోడు. అదే నాలో జీర్ణించుకుపోయింది. అంతేకాదు, మా నాన్న మాతో "ఆడవారైనా, మగవారైనా కన్న కలల్ని సాకారం చేసుకోవడమే అంతిమ లక్ష్యంగా శ్రమించాలి" అని అన్నాడు.

"నేను పైలట్ కావాలనుకోవడానికి మరో బలమైన కారణం కూడా వుంది టీచర్"

"ఏమిటది?"

"మేమున్న ఊళ్లో ఫ్లయింగ్ క్లబ్ ఉండేది. నేనూ, మా అన్నయ్య సందీప్ సైకిల్ తొక్కుతూ ఊళ్లో తిరుగుతుంటే మా నాన్న ఫ్లయింగ్ క్లబ్‌కు తీసుకెళ్లి ఆ విమానంలో ప్రయాణించే అవకాశం కల్పించారు".

ఇంతలో స్కూల్ అయిపోయిందనడానికి సూచనగా లాంగ్‌బెల్ కొట్టారు.

…

పదో తరగతి తర్వాత ఏరోనాటికల్ ఇంజనీర్ చదవాలంటే ఇంటర్‌లో ఏ గ్రూప్ తీసుకోవాలన్నది ముందే నిర్ణయించుకుని లెక్కలు, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం చదవాలనుకున్నది కవిత.

ఇంటర్ ఉత్తీర్ణురాలైన తర్వాత కవితకు అసలు సమస్య ఎదురైంది. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కోర్సు చదవాలన్న కోరికను తన తండ్రి వద్ద బయట పెట్టింది. అందుకు తండ్రి అంగీకరించలేదు సరికదా గౌరవప్రదమైన వైద్య వృత్తిని స్వీకరించమని సూచించారు.

"లేదు నాన్నా! నేను ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కోర్సే చేస్తాను. నాకు డాక్టర్ అవడం కంటే ఏరోనాటికల్ ఇంజనీర్ అవడమన్నదే నా కల. కన్న కలల్ని సాకారం చేసుకోవడమే అంతిమ లక్ష్యంగా శ్రమించాలని మీరే ఒకానొక రోజు మాతో అన్నారు కదా!"

ఆ మాటలు విన్న తండ్రి కవితతో "సరేనమ్మా! నీ ఇష్టం" అన్నారు.

కవిత ఏరోనాటికల్ ఇంజనీరింగ్ చెయ్యడానికి వెళ్లింది.

…

ఇంజనీరింగ్ కళాశాలలో ఏడుగురు అమ్మాయిలుండేవారు. వాళ్లలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చెయ్యాలనుకున్నది కవిత ఒక్కతే. ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో సీటు కావాలని అడిగినపుడు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వద్దన్నారు. పాసవడం చాలా కష్టమని చెబుతూ, ఎలక్ట్రికల్‌గానీ, మెకానికల్‌గానీ తీసుకోమని సలహా ఇస్తే, అందుకు కవిత "ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ఇవ్వండి. అలా ఇవ్వని పక్షంలో ఇంటికెళ్లిపోతాను" అని చెప్పడంతో ఏరోస్పేస్‌లో సీటివ్వక తప్పలేదు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌కు.

…

ఇక కవిత అక్కడి నుండి వెనుదిరిగి చూడలేదు.

ఓ ఇంజనీరింగ్ కాలేజీలో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసింది. అటు తర్వాత అమెరికా వెళ్లి ఓ విశ్వవిద్యాలయంలో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీని, మరో విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి.ని పూర్తి చేసి నాసాలో నాసా శాస్త్రవేత్తగా ఎంపికైంది. కవిత.

…

అంతరిక్ష కేంద్రం 'నాసా' తన పరిశోధనల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఆ విషయం తెలుసుకున్న కవిత ఆ ఇంటర్వ్యూకు అటెండ్ అయ్యింది. వందల మందిని ఇంటర్వ్యూ చేయగా– అందులో నూట ఇరవై ఐదు మంది సెలెక్ట్ అయ్యారు. ఆ నూట ఇరవై ఐదు మందిలో ఇద్దర్ని మాత్రమే 'నాసా' ఫైనల్ చేసింది. వారిలో కవిత ఒకరు.


ఇంటర్వ్యూ అనంతరం నాసా ప్రత్యేకంగా ట్రెనింగ్ ఇచ్చింది. ఆ ట్రెనింగ్ పూర్తి చేస్తేగానీ అంతరిక్షంలోకి వెళ్లే అవకాశం రాదు. నాసా శాస్త్రవేత్తగా ఎంపికైన తర్వాత కవిత ఓ కాలేజీ సెమినార్‌లో పాల్గొన్నారు.

అక్కడో విలేకరి "నేటి యువతకు సూచనలేమైనా ఇస్తారా?" అని అడగగా– "యువతకు నేను రెండు ముఖ్యమైన సూచనలు ఇవ్వదలచుకున్నాను. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకున్న తర్వాత ఆ వైపు మాత్రమే ప్రయాణించాలి. రెండవది: ఏదో ఒకటి చెయ్యండి. మీరేదైతే చెయ్యాలనుకున్నారో దాని పైనే మనసు పెట్టి చెయ్యాలనుకోవాలి. నాసా తరపున కవిత అంతరిక్ష నావలో అంతరిక్షంలోకి మొట్ట మొదటిసారి వెళ్లి అక్కడ కొన్ని రోజులు గడిపి విజయ వంతంగా తిరిగొచ్చారు. దీంతో కవిత అంతరిక్షయానం చేసిన తొలి భారతీయ మహిళగా రికార్డుకెక్కడంతో పాటు అంతరిక్షయానం చేయాలన్న తన కలని సాకారం చేసుకున్న మహిళగా చరిత్రలో నిలిచిపోయారు. ❑

# ఈ వారం కా‘ర్ట్యూన్స్’


గొప్ప గొప్ప వాళ్ళ కంపెనీల షేర్లు కొనొద్దని చెప్పానా.. తేడా..?!
BUS
Zakir...


నా మీద చెయ్యేస్తే దేశం మీదేసినట్లే...! జాగ్రత్త..!!
Zakir...


నీకొచ్చింది వారసత్వం జబ్బులా ఉంది.. రేపు మీ అమ్మా నాన్నల్ని తీసుకురా.. వాళ్ళకు టెస్టులు చేయాలి...!!
2023
LAB
DOCTOR
MD, MS, FRCS, ETC
Zakir...

# ఫోటో ఫీచర్



థాయిలాండ్‌లో వున్న ఈ ఆలయం పేరు ‘వాట్ పా మహా చేది కేవ్’. దీనిని మిలియన్ సీసాలతో తయారు చేసారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో ఓ బౌద్ధాలయం ఉండేదట. ఈ ఆలయాన్ని సీసాలతో జీర్ణోద్ధారణ చేశారు. సీసాల ఆలయం థాయిలాండ్ పర్యాటక ఆకర్షణగా మారింది.



